సంపుటం 11 సంచిక 293

స్థాపితము 1925 రిజిష్టరు నం H 45

గోలకొండపత్రిక

హైదరాబాద్ 23-9-1958 మంగళవారం

సంపాదకుడు: ఎన్. నరోత్తమరెడ్డి ఎం. ఏ

4 పేజీలు
7 నయాపైసలు

కేరళకు బియ్యం సరఫరా

కొత్తఢిల్లీ, సెప్టెంబర్ 22

లోకసభలో కమ్యూనిస్టు గ్రూపు ఉపనాయకుడు ఎ. కె. గోపాలన్ కేంద్రం కేరళకు ఆహారధాన్యాల పంపాలని కేంద్రం ఈ రాష్ట్రంపట్ల పక్షపాతంగా వ్యవహరిస్తున్నందుకు ప్రజలు ఆందోళన జరుపాలని కోరారు.

ఎ. కె. గోపాలన్ నేడు ఒకప్రకటనలో సెప్టెంబర్ నెలలో కేంద్రం కేరళకు బియ్యం పంపకపోవడం వల్ల అక్కడ ఆహార పరిస్థితి తీవ్రరూపం దాలుస్తున్నదని బియ్యం విషయమై కేరళ 50 శాతము కొరత రాష్ట్రమని వివరించారు.

కలకత్తా ట్రామ్‌వే పనివారల సమ్మె విరమణ

కలకత్తా, సెప్టెంబర్ 21

గత 42 రోజులుగా సాగిన కలకత్తా ట్రామ్‌వే పనివారల సమ్మె నేడు ఉపసంహరింపబడినది. పదివేల మంది ట్రామ్‌వే పనివారలు సమూహేతరమయి సమ్మె విరమణకు నిర్ణయించారు.

కలకత్తాలో ట్రాములు రోజుకు పదిలక్షల ప్రజల వివిధతావులకు చేరవేస్తుంటాయి ఈ సమ్మె విరమణవల్ల ఇన్నాళ్ళనుండి ప్రజలకు గల పెద్ద అసౌకర్యం దూరమైనది.

రష్ట్రి ప్రణాళిక ఈ ఏటి ఖర్చులో రు. 1.2 కోట్ల హెచ్చింపు

గ్రామీణ విద్యుచ్ఛక్తి సరఫరా, మైనర్ ఇరిగేషన్ స్కీములకు అధిక ప్రాధాన్యం

కేరళ పరిస్థితిపై లోకసభలో చర్చ వాయిదా

స్పీకర్ కమ్యూనిస్టుల ఒత్తిడికి లొంగిపోయారని ఆచార్య కృపలానీ ఆరోపణ

కేరళ జవాబుకు మీనన్ ఆరోపణల్ని పంప నిర్ణయం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22

నేడు లోకసభలో స్పీకర్‌కు ప్రజాసోషలిస్టు పక్ష నాయకుడు ఆచార్య కృపలానీకి మధ్య జరిగిన వాగ్వివాదం అనంతరం స్పీకర్ శ్రీ అనంతశయనం అయ్యంగార్ కేరళ పరిస్థితిపై చర్చ జరగాలనే డా॥ కె. బి. మీనన్ ప్రతిపాదన పరిశీలనను కాల నిర్ణయం లేకుండా వాయిదా వేశారు.

నేడు డా॥ మీనన్ సభలో ఒక ప్రకటన చేయడానికి అంగీకరిస్తానని స్పీకర్ గత శుక్రవారం చెప్పినమాటను మార్చుకొన్నారని కృపలానీ ఆరోపించారు. కమ్యూనిస్టుల ఒత్తిడికి స్పీకరూ, ప్రభుత్వమూకూడా లొంగిపోయిందని శోషం తో అన్నారు. కమ్యూనిస్టు, కాంగ్రెసు సభ్యులు కృపలానీ ఆమాట అన్నందుకు నిరసన తెలిపారు.

డా॥ మీనన్ తన ప్రతిపాదన ద్వారా చేసిన ఆరోపణల్ని హోంశాఖ ద్వారా కేరళప్రభుత్వానికి పంపి వారి సమాధానాల్ని తెప్పిస్తానని స్పీకర్ అన్నారు అతరువాత ఈ సమస్యపై చర్చకు అంగీకరించాలో లేదో నిర్ణయిస్తానన్నారు.

డా॥ మీనన్ ప్రతిపాదనలో యిలా ఉంది: "రాజ్యాంగం గ్యారంటీ చేసిన ప్రజల మూలహక్కులకే కేరళ రాష్ట్రములో భద్రత లేకుండా పోతున్నది. ఈ అంశాన్ని పరిశీలించాలి."

ఈ ప్రతిపాదనపై చర్చ ప్రస్తుత సమావేశ కాలంలోనే జరుగుతుందా అని శ్రీమతి సుచేతా కృపలానీ, శ్రీ గోవింద మాలవ్యా (కాం) ప్రశ్నించారు. గత 16 మాసాలుగా కేరళలోని శాంతిభద్రతల పరిస్థితి విషమించినదనీ యిక్కడ చర్చ జరపడానికి చాలకాలం వేచిఉన్నామనీ శ్రీమతి కృపలానీ అన్నది. చర్చ యీ సెషనులో జరగకపోతే నవంబర్ సెషనుకు వాయిదా పడుతుంది. ఈ సెషన్ కాలంలోనే చర్చ జరిగేటట్లు తొందరగా సమాధానాల్ని పంపాలని కేరళ ప్రభుత్వాన్ని కోరాలని శ్రీమాలవ్యా సూచించారు.

డా॥ మీనన్ దగ్గరనున్న డాక్యుమెంట్లనుబట్టిసభ వాయిదా పడేలోగా జవాబును పొందటం కష్టమని హోంమంత్రి పండిట్ పంత్ అన్నారు.

సభ్యులు ఏదో చెప్పాలని తనపై ఒత్తిడి తెస్తున్నారనీ, తనకు ఏమీ చెప్పడం యిష్టంలేదనీ స్పీకర్ అన్నారు. చర్చకు అంగీకరించాలా లేదా అనే విషయమై యింకా నిర్ణయాన్ని గైకొనలేదన్నారు. ఈ సమాచారం సెప్టెంబర్ 4 న తన దృష్టికి తేబడిందనీ, కాని చాలకాలం క్రితమే తేబడిందని శ్రీమతి కృపలానీ అన్నదనీ స్పీకర్ అన్నారు. "ఆ విషయం నా దృష్టికి రాగానే కేరళ ప్రభుత్వాన్ని ఉరితీయాలని చెప్పనా?" అని ఆయన అన్నారు.

నేడు ప్రశ్నోత్తరాలు పూర్తికాగానే ఆగస్టు 12వ తేదీన డా॥ మీనన్ కేరళ పరిస్థితిపై ఒక ప్రతిపాదన చేశారనీ, దానిపై డాక్యుమెంట్లు చూపాలని తానుకోరాననీ స్పీకర్ అన్నారు. కోర్టు లతీర్పులు, వార్తాపత్రికల ముక్కలు మున్నగు ఎన్నో డాక్యుమెంట్లను ఆయన చూపారు. కేరళ ప్రభుత్వ అభిప్రాయాన్ని తెలుసుకొనకుండా ఈవిషయమై ఒక నిర్ణయానికి రాకూడదని శ్రీ ఎ. కె. గోపాలన్ ప్రభృతులు తనను కోరారన్నారు. ఈ ఉదయం హోంమంత్రి కేరళ ముఖ్యమంత్రి టెలిగ్రాంను చూపారు. ఈ దృష్ట్యా ఈ ప్రతిపాదనపై చర్చను వాయిదా వేస్తున్నానని స్పీకర్ అన్నారు.

వెంటనే ఆచార్య కృపలానీ లేచి ఈ ప్రశ్న సెషన్ ప్రారంభంలోనే వచ్చిందనీ, చర్చ జరగాలని ప్రధాని అన్నారనీ అన్నారు.

కొందరుసభ్యులు: లేదు ఆయనలా అనలేదు.

పాఠశాలల్లో మెట్రిక్ పద్ధతి గణితశాస్త్రబోధన

లోకసభలో వివరణ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 22

రాష్ట్రాల్లో ప్రస్తుతం అమల్లోఉన్న పాఠ్యగ్రంథాలు తిరిగి ముద్రింపబడవలసిన అవసరం వచ్చినప్పుడు గణిత శాస్త్రబోధనలో మెట్రిక్ కొలతలు, తూనికలకు ఎక్కువ ప్రాధాన్యమిస్తూ పాఠ్యభాగాలను పునఃరచించి ముద్రించడానికి రాష్ట్రప్రభుత్వాలన్నీ ఒప్పుకున్నాయనీ నేడు లోకసభలో ఒక ప్రశ్నకు జవాబిస్తూ వాణిజ్య వ్యవహారాల ఉపమంత్రి శ్రీ సతీశ్‌చంద్ర అన్నారు.

పాఠ్యభాగంగా ఉన్నా లేకపోయినా యీ లోపుగానే విద్యార్థులకు దశాంశ పద్ధతి లెక్కల బోధనకు ఎక్కువ శ్రద్ధవహించాల్సిందిగా ఉపాధ్యాయులకు ఆదేశాలివ్వబడ్డాయట. రాష్ట్రవిద్యాశాఖ డైరెక్టర్ల ద్వారా మెట్రిక్ పద్ధతి మాన్యుయల్ ప్రతులు సెకండరీ పాఠశాలలందజేయబడుతున్నాయనీ ప్రాథమిక పాఠశాలల వినియోగానికై ఆ మాన్యుయల్ ప్రాంతీయ భాషల్లోకి తర్జుమా చేయబడుతున్నదనీ శ్రీ సతీశ్‌చంద్ర వివరించారు.

మెట్రిక్ పద్ధతి మూలంగా ఇప్పటి పాఠ్యపుస్తకాలను ఇప్పుడే మార్చడం తలపెట్టబడలేదు.

ఇండోనీషియాలో జనరల్ ఎన్నికల వాయిదా

జకార్తా, సెప్టెంబర్ 22

వచ్చే సెప్టెంబర్‌లో జరుపదలచిన రెండవ జనరల్ ఎన్నికల ఇండోనీషియా ప్రభుత్వం వాయిదా వేసినది.

ఈ జనరల్ ఎన్నికలు ఒక సంవత్సరం వరకు వాయిదా వేయబడినవని అధికారికంగా ప్రకటింపబడినది.

REAL DRY-CLEANING in PETROL
YOU ARE
Welcome to inspect
OUR WORKSHOP at KINGSWAY
fashions
ELECTRIC DRY-CLEANERS
KINGSWAY, PARKLANE, RESIDENCY,
NAMPALLY, NAYAPUL, KACHIGUDA

దక్షిణాది రాష్ట్రాలలో విద్యుత్సౌకర్యాల అభివృద్ధి

తగుసలహా ఇవ్వడానికి కమిటీ నియామకం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 22

మద్రాసు, ఆంధ్ర ప్రదేశ్, కేరళ రాష్ట్రాలలోనూ- మైసూరు రాష్ట్రంలోనూ సమన్వితప్రాంతీయ పద్ధతిపై విద్యుత్సౌకర్యాలను పెంపొందించేందుకుగాను ఆయా ప్రాంతీయాధికారులకు తగుసలహా లివ్వడానికి ఒక కమిటీని నియమించాలని 1957 సెప్టెంబరులో జరిగిన దక్షిణ మాండలిక సమితి ద్వితీయ సమావేశం నిర్ణయించింది.

లోకసభలో సర్దార్ ఇక్‌బాల్ సింగ్ అడిగిన ప్రశ్నకు లిఖిత పూర్వకంగా సమాధానం చెబుతూ ఇరిగేషన్, విద్యుత్‌శాఖ ఉపమంత్రి, శ్రీ జైసుఖలాల్ హథీపై సమాచారంమిచ్చారు.

ఆయన ఇంకా ఇలా అన్నారు:- ఆ కమిటీలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున అభివృద్ధిశాఖ అదనపు కమిషనరు, శ్రీ సి. నరసింహం, ఐ.సి.ఎస్. విద్యుత్‌శాఖ చీఫ్ ఇంజినీరు, శ్రీ ఎ. ఖాదరు, మద్రాసు రాష్ట్రం తరపున పబ్లిక్ వర్క్సుశాఖ కార్యదర్శి, శ్రీ టి.ఎ. వర్టీస్ సిలస్, విద్యుత్ శాఖ ఇంజినీరు, శ్రీ వి. పి. అప్పాదురైలూ, కేరళ రాష్ట్రం తరపున ఆ రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ ఎన్.ఇ.ఎస్. రాఘవాచారి, ఐ.సి.ఎస్. కేరళ రాష్ట్ర విద్యుచ్ఛక్తిబోర్డు అధ్యక్షుడు, శ్రీ కె-పి-శ్రీధరన్ నాయర్ మైసూరు రాష్ట్రం తరపున ప్రణాళికాశాఖ కార్యదర్శి, శ్రీ జి-వి-కె-రావు, ఐ-ఎ-ఎస్- రాష్ట్ర విద్యుచ్ఛక్తి సంస్థ ప్రధాన యింజినీరు, శ్రీ కె-ఎల్-డిసా, జలవిద్యుచ్ఛక్తిశాఖ ప్రధాన ఇంజినీరు, శ్రీ హెచ్- వి- నారాయణరావులు సభ్యులుగావున్నారు.

ఎమ్. ఎల్. ఎ. క్వార్టర్సువద శిశువుశవం

హైదరాబాద్, సెప్టెం 22

హిమాయత్ నగర్ లోని ఎం ఎల్. ఎ. క్వార్టర్స్‌వద్ద ఒక కాలులేని క్రొత్తగా పుట్టిన శిశువుశవం కాన్పించినది. పోలీసులు ఆరాతీయగా నేటి ఉదయం ఒక స్థానిక ప్రసూతి శాలలో ఒకరు ప్రసవించారని పుట్టిన శిశువు కొంతసేపటికి మరణించగా ఆమె జనన సంస్కారానికై ఆ కళేబరాన్ని ప్రసూతిశాల పనిమనిషికి అప్పగించగా ఒక బకెట్‌లో దానిని పెట్టుకొని పాతిపెట్టుటకై వస్త్రం తదితర సామగ్రిని తెచ్చుటకు వెళ్ళేలోగా కుక్క దానిని బయటికి ఈడ్చి క్వార్టర్సువద్దపారవేసినదని తేలినది. ఈ సందర్భంలో పోలీసులు ఇంకా దర్యాప్తు చేస్తున్నారు

గుంటూరుజిల్లా పోలీసు స్పోర్ట్సు

(స్వ. వి)

గుంటూరు, సెప్టెం 22

గుంటూరుజిల్లా పోలీసు వారు వార్షిక ఆటలు, గుంటూరుజిల్లా కలెక్టరు ఎం. ఏ హాలీమ్ అధ్యక్షతన జరిగినవి.

దాదాపు 20 వేల మంది ఈ ఆటలను దర్శించారు.

జిల్లా పోలీసు సూపరింటెండెంట్ శ్రీ టి వి. రాజేశ్వర్ ఆహ్వానితులకు స్వాగతవచనాలు పలికారు.

ఛాంపియన్‌షిప్ షీల్డు గుంటూరు సబ్‌డివిజన్ వారికి వచ్చింది. తెనాలి, ఒంగోలు, సబ్‌డివిజనులు ఆయా ఆటలలో గెలుపొందినవి విజయం పొందిన వారికి శ్రీమతి మహాలక్ష్మి రాజేశ్వర్ బహుమతులను బహుకరించారు. మంచుగుండుసామగ్రి కాల్చబడినది.

కర్నూలు-కడపకాలువ, రాజోలిబండ స్కీములకై రు.70లక్షలు, ఉపాధ్యాయుల వేతనాలహెచ్చింపుకు రు. 50 లక్షలు

హైదరాబాద్, సెప్టెం 22

కర్నూలు-కడప కాలువకు పిల్లకాలువల నిర్మించడానికి, రాజోలిబండ స్కీము అమలుకు, ఉపాధ్యాయుల వేతనాల హెచ్చింపుకై 1958-59 సంవత్సరపు రాష్ట్రప్రణాళిక వ్యయం రు. 30 కోట్లనుండి రు. 31.2 కోట్లకు పెంచబడింది. రాష్ట్ర రెండవ ప్రణాళికకు ఉద్దేశించబడిన మొత్తం వ్యయం రు. 175 కోట్లు కర్నూలు-కడప కాలువ స్కీము, రాజోలిబండ స్కీము రు 70 లక్షలు, ఉపాధ్యాయుల వేతనాల హెచ్చింపుకు రు. 50 లకు లక్షలు వ్యయపరచబడగలవు

1958-59 సంవత్సర ప్రణాళికలో రు. 1.2 కోట్ల హెచ్చింపును గూర్చి ప్లానింగు మంత్రి శ్రీ వి- బి- రాజు తెలుపుతూ వర్తమాన సంవత్సరానికి కేంద్రంనుండి రాగలసహాయం తొలుత రు. 18 కోట్లకు నిర్ణయింపబడి ఉండెనని ఇప్పుడది రు. 19.9 కోట్లకు పెంచబడినదని వెల్లడిచేశారు. ప్లానింగ్ కమిషన్‌తో సంప్రదింపులు జరిపిన మీదట వీరు నేడు హైదరాబాదుకు తిరిగి వచ్చారు. రాష్ట్రంలో ప్రణాళిక స్కీముల అమలు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కనిపనుకు సంతృప్తిని కలిగించినదని, ప్రణాళిక వ్యయానికై రాష్ట్రంలో అంతరింగికంగా సేకరించవలసిన రు. 11.9 కోట్లకు మారుగా అదనపు పన్నులద్వారా రెట్టింపు సొమ్మును రాష్ట్రప్రభుత్వం సమకూర్చుతున్నదని దీనికి ప్లానింగు కమిషను అభినందించినదని వీరు తెలిపారు.

ప్లానింగు కమిషన్ ఈరాష్ట్రానికై నిర్ణయించిన గరిష్ఠపరిమాణం రు. 59.5 కోట్లు అయితే ప్రణాళికా వ్యయానికి గాను రు. 67.1 కోట్లు సేకరింపబడే అవకాశం ఉన్నది. రాష్ట్రప్రభుత్వం ఈ సంవత్సరపు ప్రణాళికా వ్యయాన్ని రు. 9 కోట్లకు పెంచుమని కోరినదని ప్లానింగు కమిషన్ దీనిని సానుభూతిపూర్వకంగా పరిశీలించుటకు వాగ్దానం చేసినదని శ్రీ వి- బి- రాజుగారు తెలిపారు. గ్రామాలకు విద్యుచ్ఛక్తి సరఫరాకై ప్రణాళిక వ్యయాన్ని పెంచవలసి ఉన్నది. రాష్ట్రరెండవ పంచవర్ష ప్రణాళికలో ఈ నిమిత్తకై కేటాయించబడిన మొత్తం రు. 27.8 కోట్లు మాత్రమే. ఇది ప్రస్తుత అవసరాల దృష్ట్యా చాలీలా కాన్పించబడంలేదు. ప్లానింగు కమిషన్ విద్యుచ్ఛక్తి మరియు ఇరిగేషన్ అవసరాల పూర్తికై రాష్ట్ర ప్రణాళికను సవరించుటకు అంగీకరించినదట.

ఆహారోత్పత్తిని అధికం చేయుటకై గండ్లుపడిన చెర్వులు కుంటల మరమ్మతుకు మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు ఎక్కువ ప్రాధాన్యాన్ని ఇవ్వాలని ప్లానింగ్ కమిషన్ ఆదేశించినదని తెలంగాణాలో నిరుపయోగంగా ఉన్న పెక్కుకుంటలు చెర్వుల మరమ్మతు ఆవశ్యకత ప్లానింగ్ కమిషనుకు నివేదించబడినదని ఈ మంత్రి తెలిపారు

రాష్ట్రప్రణాళికనుగూర్చి ప్లానింగ్ కమిషన్‌తో ముఖ్యమంత్రి ఎన్. సంజీవరెడ్డి ఆర్థికమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి ప్లానింగ్ మంత్రి వి బి రాజు ప్లానింగ్ కార్యదర్శి నరసింహం చర్చల జరిపారు. ముఖ్యమంత్రి ఆర్థికమంత్రి రేపు హైదరాబాద్‌కు వస్తున్నారు.

సాంస్కృతిక దృక్పథాన్ని పెంపొందించుకొనండి

విద్యార్థులకు శ్రీ గిరి విజ్ఞప్తి

ఆగ్రా, సెప్టెం 22

ఆగ్రా విశ్వవిద్యాలయ ఛాన్సలర్, యు.పి. గవర్నర్ అయిన శ్రీ వి.వి. గిరి ద్వితీయ ఆగ్రా విశ్వవిద్యాలయ యువజన దినోత్సవంలో గతరాత్రి బహుమతుల ప్రదానం గావిస్తూ జాతి భవిష్యత్ బాధ్యతల్ని స్వీకరించడానికి అనువుగా తమ జీవితంలో సాంస్కృతిక దృక్పథాన్ని పెంపొందించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులలో అట్టి సాంస్కృతిక కార్యకలాపాన్ని ఏర్పాటు చేసినందుకు శ్రీ గిరి ఆగ్రా విశ్వవిద్యాలయాన్ని అభినందించి విద్యార్థుల్ని రాజకీయ వేత్తలుగాగాక బాధ్యులుగా పరిగణించాలన్నారు వారి మానసిక ప్రవృత్తి, ఆశల్ని అర్థం చేసుకోవాలి విశ్వవిద్యాలయ జీవనాన్ని పెంపొందించడానికి విద్యార్థి, ఉపాధ్యాయ, తలిదండ్రుల సంఘాలు సమీకరించబడాలని ఆయనన్నారు.

చచ్చి బ్రతికిన రోగి:

బొంబాయి, సెప్టెం 22

చనిపోయినట్లు ప్రకటించబడిన ఒక రోగి సెయింట్ జార్జి ఆసుపత్రిలో మళ్ళీ ప్రాణాన్ని పొందటం వైద్యులందరికీ ఆశ్చర్యం కలిగింది.

గుండెలో పుండు ఉన్నదని ఆసుపత్రిలో చేర్చబడిన 50 సంవత్సరాల వయస్సుగల ఆరోగికి ఆపరేషన్ చేశారు ఆపరేషన్ పూర్తి అయ్యేసరికి అతనిగుండె కొట్టుకోవడం విరమించినది.

ఇన్‌ఛార్జి సర్జన్ ఆ సమీపంలోని ఆపరేషన్ థియేటర్‌లో ఉన్న శస్త్ర వైద్యులకు కబురు పంపాడు వారు 8 నిముషాలు ఆలస్యంగా "చనిపోయిన" రోగి దగ్గరకు వచ్చి గుండెను తెరచి మెసేజ్ చేశారు. 10 నిముషాలలో మళ్లీ గుండెకొట్టుకోవడం ప్రారంభించినది.

ఆమరునాడు రోగి మామూలుగానే ఉన్నాడు.

ఉత్తర ప్రదేశ్‌లో మళ్ళీ సహజ పరిస్థితులు

అందరి సహకార కృషితో త్వరలో నెలకొనగలవని గవర్నర్ ఆశాభావం

ఆగ్రా, సెప్టెం 22

ఉత్తరప్రదేశ్ గవర్నర్ శ్రీ వి. వి. గిరి స్థానిక విలేఖరులతో ముచ్చటిస్తూ ఉత్తరప్రదేశ్‌లో సహజ పరిస్థితులు మళ్లీ త్వరలోనే ఏర్పడగలవనే ఆశాభావాన్ని వెలిబుచ్చారు.

"ప్రస్తుత ఆర్థిక క్లిష్టతను పరిష్కరించడానికి అన్నివర్గాలూ ఆతృతగా ఉన్నందుకు నేను సంతోషిస్తున్నాను. ముఖ్యమంత్రి డా॥ సంపూర్ణానంద్ ఉత్తమ గుణాలుగల రాజకీయవేత్త. ఆయన ఎప్పుడు ఏదిచేయాలో అలా చేయగలరని విశ్వసిస్తున్నాను. శాంతి సాధనకు అన్నిపార్టీలూ కృషిచేయగలవని ఆశిస్తున్నాను" అని ఆయన అన్నారు.

డా॥ సంపూర్ణానంద్ మంత్రి వర్గ సభ్యులు అన్నివర్గాల ప్రజల సహకారంతో ప్రస్తుత ఆర్థిక క్లిష్టతను పరిష్కరించగలరనే ఆశాభావాన్ని ఆయన వెలిబుచ్చారు. మనప్రధాని సలహానను సరించి అంతా విద్వేషాలు మాని ఒకరితో ఒకరు సహకరించి కృషిచేయాలి.

"అలా జరిగితే మన యిబ్బందులు తొలగిపోగలవు" అనికూడ శ్రీ గిరి అన్నారు.

నగర విద్యుచ్ఛక్తి సరఫరా విధానం

రు. 22.50 లక్షలతో వర్తమాన సంవత్సరం పునర్ నిర్మాణం

హైదరాబాద్, సెప్టెం 22

ఆంధ్రప్రదేశ్ రాజధాని నగరమగు హైదరాబాదు మరియు సికింద్రాబాదులందు విద్యుచ్ఛక్తి సరఫరా విధానాన్ని పునర్ నిర్మాణం చేయుటకు వర్తమాన సంవత్సరంలో రు. 22 50 లక్షలు వ్యయపరచ బడగలవు.

రామగుండం థర్మల్ స్టేషన్ నిజాంసాగరు హైడ్రోస్టేషన్‌ను హైదరాబాదుతో కలుపడం మూలంగా ఇక్కడిపవరు సప్లయి సిస్టమ్‌ను రీమాడల్ చేయవలసిన ఆవశ్యకత ఏర్పడినది.

సబ్ స్టేషనులు 9.3 కిలోవాట్ల రింగ్ మెయినులు సిటీడిస్ట్రిబ్యూషన్ సిస్టమ్‌ను 6.6 కిలోవాట్లకు మార్చడానికి అమర్చబడగలవు 75 వేల పౌండ్ల హౌస్సు పవరుగల ఇంకొక బాయిలరు హుసేన్‌సాగరు పవరు స్టేషన్‌లో ఏర్పరచబడుతుంది. ఈ విధంగా స్టేషనులో బాయిలర్‌శక్తి పెంచబడుతుంది

9.3 కిలోవాట్ల మెయిన్‌ను 6.6 కిలోవాట్ల మెయిల్‌గా మార్చుట నగరపు కొన్ని ప్రాంతాలలో పూర్తిఅయినది. మిగతా ప్రదేశాలలోగూడా ఈ పని వర్తమాన సంవత్సరంలోనే పూర్తి చేయబడగలదు. 9.3 కిలోవాట్ రింగ్ మెయిన్‌ను ఏర్పరచడంతో రేడియల్ మరియు రింగ్ ఫీడర్ల అమర్చుట పూర్తి కాగలదు.

గోవులు, వానిసంతతి రక్షణ ఆవశ్యకత

ఉద్యమం సంకుచితమైనది కాదని వివరణ

హైదరాబాద్, సెప్టెంబర్ 22

గోవధ నిషేధాన్ని గూర్చి ప్రస్తుతం జరుగుచున్న ఆందోళనపై కొన్ని విమర్శలు కాన్పిస్తున్నాయి. దీనిని కేవలం మార్వాడీలే నిర్వహిస్తున్నారని సమాజంలో హీనస్థితిలో ఉన్న భిక్షుకులు వికలాంగులపై వీరికి లేని కరుణ వాత్సల్యం గోవులపై గనబరుస్తున్నారని ఈ ఉద్యమం సంకుచితమూ మతపాక్షికమూ అని ఆరోపణలు చేయబడటం కద్దు.

ఇవి ఎంతవరకు సహేతుకమో కావో సనాతన ధర్మ సభ ప్రతినిధి ఒకరు ఇలా వివరించారు. గోవులతో పాటు వాని సంతతి గూడా కసాయివారికి ఎరగాకుండా శాసనం ద్వారా రక్షణ కల్పింపబడాలని చేయబడుచున్న ఆందోళన వ్యవసాయాభివృద్ధికి, పాడి పంటలతో దేశం సుభిక్షంగా ఆహార కొరత లేకుండా మనగలుగడానికి ఉద్దేశింపబడినది ఇందువల్ల మార్వాడీలకు ఒరిగేది ఏమీలేదు మార్వాడీలు వ్యాపారం వృత్తిగా కలవారిలో ఒక భాగము మాత్రమే గోవులు వాని సంతతికి రక్షణ కల్పించడంవల్ల ఎక్కువ లాభం కలిగేది కర్షక జనాళికి, దేశానికికాని వీరికి కాదు గోవులు ఎద్దులు ఎంత బక్కచిక్కి వ్యవసాయానికి నిరుపయోగమైనా అవి ఇచ్చే పేడా మూత్రము సహజమైన ఎరువులుగా రైతులకు ఉపయోగిస్తవి. వానికి విలువకట్టిన ఆ సొమ్ము అట్టి బలహీన పశువుల పోషణకు సరిపోగలదు. గోరక్షణకై గోశాలల నిర్వహణకు ఏవిధంగా వీరు సహకరిస్తున్నారో దానధర్మములందు ఏ ఇతర వర్గాలకు తీసిపోరు. ఇందుకు పెక్కు ఉదాహరణలు కలవు.

గోవధ నిషేధం వల్ల చర్మకారక వృత్తిపై ఎట్టి ప్రభావం పడబోదు సహజంగా ఇవి మృతినొందినమీదట వాని చర్మమూ కొమ్ములు మున్నగునవి లభించగలవు. ఇకపోతే కసాయి వృత్తిగా గలవారికి ఇది నష్టకారి అని ఒక వాదన కలదు కసాయివారివృత్తి కొనసాగడానికి మాంసాహారులకు గోవులే అవసరము కాదు. ఇతర జంతుజాలము కలదు కూడాను. అవసరమైనచో కసాయివారు ఇతర ఉపవృత్తుల అనుసరింపవచ్చును. ప్రపంచ వ్యాప్తంగా కూడా రోజురోజుకూ మాంసాహారం తగ్గి శాకాహారానికి ప్రాబల్యం పెరుగుచున్న విషయం గూడా ఈసందర్భంలో గమనార్హము ఇండియాలో దాదాపు అరు రాష్ట్రప్రభుత్వాలు గవరకే శాసనం ద్వారా గోవధను నిషేధించిఉన్నాయని ఆంధ్రప్రదేశ్‌గూడా శాసనం ద్వారా గోరక్షణకు భద్రతను త్వరలో చేకూర్చి ప్రజామన్నను పొందాలని ఈ ప్రతినిధి కోరారు. (స్వ వి)

జ్ఞాన ప్రకాశ పాఠశాల, భక్త సమాజం

21 సెప్టెంబర్ రాత్రి తొమ్మిది గంటలకు చప్పల్ బజారులోని జ్ఞాన ప్రకాశ రాత్రి పాఠశాల మరియు భక్త సమాజం అధ్వర్యాన ఒక బహిరంగ సభ జరిగినది దీనికి శ్రీ రతన్ లాల్ అగర్‌వాల్ అధ్యక్షత వహించారు. అందు ఏకగ్రీవంగా ఈ దిగువ తీర్మానం చేయబడినది:-

"ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరియు రాష్ట్ర శాసనసభను ఈ సమావేశము గోహత్యా నిషేధ శాసనాన్ని చేయడం ద్వారా గోవులను దాని సంతతిని పరిరక్షించవలసినదిగా అభ్యర్థిస్తున్నది

ప్రజలు మరియు జాతియొక్క ఈ కోరికను పూర్తి చేయడం ద్వారా ప్రభుత్వం ప్రజాస్వరజకత్వాన్ని ప్రదర్శించాలని శ్రీ రామచంద్రవీర్ సాగిస్తున్న నిరశన దీక్ష సఫలం కావాలని కోరుచున్నది"

చంద్రాపూర్ ప్రజల అభ్యర్థన

హైదరాబాద్‌నగరంలోనిచంద్రాపూర్‌లో 19 వ తేదీ సాయంత్రము శ్రీ సత్యనారాయణ గారి అధ్యక్షతన బహిరంగసభజరిగినది ఇందుగోహత్యా నిషేధానికై రామచంద్రవీర్ సాగిస్తున్న నిరశనదీక్షపట్ల ఆందోళనవ్యక్తం చేయబడినది. ప్రభుత్వం గోవధ శాసనంద్వారా వెంటనేనిషేధించాలని కోరుతూ ఈ దిగువ తీర్మానం చేయబడినది.

"గోవధ నిషేధానికై స్వామి రామచంద్ర వీర్ సాగిస్తున్న నిరశన దీక్షపట్ల ఈ సమావేశం తీవ్ర ఆందోళనవ్యక్తంచేస్తున్నది ముఖ్యమంత్రి దినదినం క్షీణిస్తున్న శ్రీ స్వామి వారి ఆరోగ్యాన్ని గోరక్షణసమస్యయొక్క ప్రాధాన్యాన్ని గ్రహించి త్వరలోనే రాష్ట్ర శాసనసభద్వారా గోహత్యా నిషేధ శాసనాన్ని చేయించగలరని ఆశిస్తున్నది

దేశీయ ఉత్పత్తుల ధరల పెరుగుదల

ముడిసరుకుల దిగుమతులకు ఎక్కువకేటాయిం చేయవలసి ఉంటుందని శ్రీ లాల్ బహాదర్ శాస్త్రి

న్యూఢిల్లీ సెప్టెం 22

ఈ మారు లైసెన్సింగ్ పరిమితి కాలంలో దేశంలో ఉత్పత్తి అయ్యే వస్తువుల ధరలు పెరగకుండా జాగ్రత్తపడేందుకై దేశీయోత్పత్తులకు అవసరమైన ముడిసరుకుల దిగుమతికై ఎక్కువ కేటాయించే అవకాశం ఉంటుందేమో పరిశీలింపబడగలదని నేడు లోకసభ ప్రశ్నోత్తరాల సమయంలో వాణిజ్య పరిశ్రమలమంత్రి శ్రీ లాల్ బహాదర్ శాస్త్రి తెలిపారు

ఫ్యాక్టరీ స్థాయిలో ధరలను కంట్రోలు చేయడం సంభవిస్తున్నదనీ దానికి మిల్లు యజమానుల్ని, ఉత్పత్తిదారుల్ని అభినందించాల్సి ఉంటుందనీ శ్రీ లాల్ బహాదర్ శాస్త్రి అన్నారు. కాని ధరలు టోకు వర్తకులు, చిల్లర వర్తకుల స్థాయిలో పెరుగుతున్నాయనీ యీ స్థాయిలో వాటిని అరికట్టడానికి ఏమీ చర్యలు తీసుకోబడజాలవనీ కూడా ఆయన అన్నారు.

దేశంలో ఉత్పత్తి అయిన వస్తువుల ధరలు కూడా అనంతంగా పెరిగిపోయాయనే వీలులేదని ఆయన అన్నారు.

ఈ అధిక ధరలను అదుపులో పెట్టడానికి ఆహార ధాన్యాలకువలె కంట్రోళ్ళు పెట్టడం సాధ్యపడదని ఆయన ప్రస్తావించారు.

కాగితం పరిశ్రమలో ధరలు ఎలా ఉన్నదీ విచారించేందుకు టారిఫ్ కమిషన్‌ను కోరినట్లు కూడా ఆయన చెప్పారు.

అణ్వాయుధ పరీక్షలు నిలుపుడం

తన త్రివిధానపరిశోధన [illegible] నివేదికలో ఆక్టోబరు 31 నుంచి సమాలోచనలు

వాషింగ్టన్, సెప్టెంబరు 22

అంతర్జాతీయ కంట్రోలు విధానం క్రింద అణ్వాయుధ పరీక్షలు నిలుపుదలకు అక్టోబరు 31 నుంచి తెలివాలో సంప్రదింపులు ప్రారంభించడానికి బ్రిటన్, సోవియట్ రష్యాలతో అమెరికా తన అభీష్టాన్ని ప్రకటించింది.

ఈ చర్చలు 2 మొదలు 3 వారాల వరకూ జరగాలని సోవియట్ ప్రభుత్వం ప్రతిపాదిస్తున్నది. ఈ సంప్రదింపులు ఎంత త్వరగా ముగిస్తే అంత మంచిదని అమెరికా భావిస్తున్నప్పటికీ ఈ సమాలోచనలు విజయవంతంగా సమాప్తం కావడానికి ఎంతకాలాన్ని వెచ్చించటం అవసరమనిమనం పరస్పరం భావించుకుంటామో అంతవరకూ జరపడానికి అమెరికా అంగీకరిస్తున్నదని అమెరికా తెలియజేసింది.

ఈ సమావేశానికి అమెరికా ప్రతినిధి వర్గం చెయిర్మన్‌గా నిరాయుధీకరణ వ్యవహారాలలో అమెరికా ప్రతినిధి రాయబారి జేమ్స్ జె. వాడ్స్‌వర్త్ ఉంటాడు.

భారతదేశంలో వైద్యపరికరాల ఉత్పత్తి కర్మాగారం

అమెరికన్ సంస్థచే ఏర్పాటు

వాషింగ్టన్, సెప్టెంబరు 22

శస్త్ర, వైద్య, పాకశుద్ధ్య సంబంధమైన పరికరాలు తయారుచేసే ప్రముఖ అమెరికన్ సంస్థ జాన్సన్ అండ్ జాన్సన్ భారతదేశంలో ఒక కర్మాగారం స్థాపించి, వాటి తయారు చెయ్యప్రారంభిస్తుందని నివిదేశాంగశాఖ ప్రకటించింది.

భారతీయ ఆర్థిక వ్యవస్థ దృష్ట్యా ఈ అమెరికన్ సంస్థపెట్టే మూలధనం ఒక మాదిరిఅయినది ఎన్నగా తగినది. కాని జాన్సన్ అండ్ జాన్సన్ లాంటి కంపెనీలు తయారుచేసే వాటినన్నింటినీ దిగుమతిచేసుకోవలసిన స్థితిలో ప్రస్తుతంఉన్న భారతదేశపుప్రాతిపదిక పారిశ్రామిక కార్యక్రమానికి ప్రజారోగ్యఅభివృద్ధికి ఆ పథకం ఎంతో దోహదకారిగా ఉంటుంది" అని విదేశాంగ శాఖవ్యాఖ్యానించింది.

తిరుపతిలో నాటికా నాటక ప్రదర్శనపోటీలు

తిరుపతి, సెప్టెంబరు 22

శ్రీవేంకటేశ్వర నాట్యకళా పరిషత్తు ఆధ్వర్యమున నవంబరు 15 వ తేదీనుండి 30 వ తేదీలోగా నాటక, నాటికల పోటీలు జరుగును. ఎంట్రీలు చేరుటకు ఆఖరుతేదీ 20-11-1958.

ఇతర వివరములకు కార్యదర్శి శ్రీవేంకటేశ్వర నాట్యకళాపరిషత్తు తిరుపతికి వ్రాసి తెప్పించుకోవచ్చును. విజయవంతమైన 12 వ వారము

బాంబే ఫిల్మ్స్ వారి

'యహూది'

తా॥ సొహరాబ్ మోడీ, దిలీప్‌కుమార్, మీనాకుమారి,

నిర్మాత: షాహిద్ ఎ. వాచ.
దర్శకత్వం: బిమల్ రాయ్.
సంగీతం: శంకర్ జైకిషన్.

రాయల్ హైదరాబాద్ చిత్రా సికింద్రాబాద్.

శ్రీ సినీ కార్పొరేషన్ విడుదల (Trupix)

[illegible] నం॥ భాద్రపద శుద్ధ ఏకాదశి [illegible] 24 [illegible] తేదీ 5-3 [illegible] 7-17 [illegible] శాలివాహన శకము 1879 [illegible] 1955 [illegible] 28 మంగళవారము

ధనము-ద్రవ్యము

"ధనమును బంధించి యుంచినపుడు అది నిర్ధనస్థితికి కారణమగును. గనుక ధనమును ద్రవ్యముగా రూపొందింపవలెను. అంటే ప్రవహించునట్లు చేయవలెను. ధనము ప్రవహించినపుడే అది ద్రవ్యరూపమును దాల్చును. ద్రవ్యరూపమును పొందించినపుడు ధనము ధన్యమగును"

— వినోబా.

గోలకొండ పత్రిక

ఫోన్. నెం. 3280

1958 సెప్టెంబర్ 23

మంగళ వారము

ఐక్యరాజ్య సమితిలో చైనా ప్రాతినిధ్యము

ఐక్యరాజ్య సమితిలో ప్రస్తుత చైనా ప్రభుత్వానికి ప్రాతినిధ్యము కలిగించుట కొరకు శ్రీ కృష్ణమేనన్ చేసిన ప్రయత్నము మళ్ళీ ఒకసారి విఫలమైనది అసలు చర్చనీయాంశములలో యీ సమస్యను చేర్చుటకు గూడ సారధ్య సంఘము కొన్ని అధిక వోట్లతో నిరాకరించినది ఈ నిరాకరణ సముచితమైనది కాదు. సమస్యలను పరిష్కరించుటకు బదులుగా ఐక్యరాజ్యసమితిలో చైనా బహిష్కరణ, సమస్యలను మరింత క్లిష్టముగావించుచున్నది ముఖ్యముగా అమెరికా ప్రభుత్వము యీవిషయములో వాస్తవిక దృక్పథముతో వ్యవహరించక పోవుట అత్యంత శోచనీయము.

చైనాలోని కమ్యూనిస్టు ప్రభుత్వమును ప్రపంచములోని అత్యధిక జనాభాకు ప్రాతినిధ్యము వహించు ఇరువది తొమ్మిది రాజ్యాలు పరిగణించి, రాయబార కార్యాలయాలను నెలకొల్పుకొనినవి. అమెరికాకు అత్యంత సన్నిహితముగా నున్న ఇంగ్లండు దేశము రూడ చైనాతో సమానస్థాయియందు వాణిజ్యాది వ్యవహారాలను నిర్వహించుకొనుచున్నది. ఈ పరిస్థితిలో అమెరికా అవలంబించుచున్న విధానము యెంత మాత్రము సరియైనది కాజాలదు.

ఒక దేశములోని ప్రభుత్వము పెట్లుండవలెనను సమస్య ఆ దేశ ప్రజల అంతరంగిక సమస్య. ఒక విదేశ ప్రభుత్వము యొక్క స్వరూపము మనకు ఇష్టము కానంత మాత్రాన దాని అస్తిత్వమును పరిగణించక, దానిని బహిష్కరించుటకు చేయు ప్రయత్నము రాజనీతిజ్ఞతకు నిదర్శనము కాదు ఎవరికి ఇష్టమైనను కాకపోయినను, చైనాలోని ప్రస్తుత ప్రభుత్వము సుస్థిరముగా నుండి, దేశ వ్యవహారాలను నిర్వహించుకొనుచున్నది, అయినప్పటికిని, ఆ ప్రభుత్వమును ఐక్యరాజ్య సమితిలో పరిగణించక పోవుట ఘోరమైన ప్రమాదమని నిస్సందేహముగా చెప్పవచ్చును. చైనా సువిశాలమైన దేశము, జనాభా దృష్ట్యా గాడ చైనా ప్రపంచ రాజ్యాలలో ముఖ్యమైన దగియున్నది. ఇటువంటి చైనాకు ఐక్యరాజ్య సమితిలో ప్రాతినిధ్యము లేకపోవుట సమంజసము కాజాలదు.

ప్రస్తుతము చైనాలో యేమాత్రము స్థానము లేక ఫార్మోజా దీవులలో తలదాచుకొనిన చియాంగ్ కై షేక్ ప్రభుత్వమునకు ఐక్యరాజ్య సమితిలో స్థానమునిచ్చుట జరుగుచున్నది. ఇది సక్రమమైన పద్ధతి కాదు. ఫార్మోజాదీవులలోని, చియాంగ్ కై షేక్ ప్రభుత్వము చైనా ప్రజలకు ప్రాతినిధ్యము వహించుటలేదు. చైనాలోని మావ్ ప్రభుత్వము సుస్థిరముగా చైనా పరిపాలన బాధ్యతను నిర్వహించుచున్నది. అందుచేత ఇప్పుడు చైనాకు క్రొత్తగా ఐక్యరాజ్య సమితిలో స్థానము కల్పించవలసిన అవశ్యకత లేదు. చియాంగ్ కై షేక్ ప్రభుత్వానికి ఐక్యరాజ్య సమితిలోగల ప్రాతినిధ్యమును రద్దుచేసి, దాని స్థానములో మావ్ ప్రభుత్వమునకు ప్రాతినిధ్యము యిచ్చుట జరుగవలసి యున్నది. ఇది జరుగనంతవరకు ఐక్యరాజ్యసమితిలో ఒక పెద్దలోటు ప్రస్ఫుటముగా గోచరించగలదు. ప్రపంచ శాంతి దృష్ట్యా, ప్రపంచ సమస్యల పరిష్కారము దృష్ట్యా, యీ సమస్యను వాస్తవిక దృక్పథముతో ఆలోచించి, చైనాలోని మావ్ ప్రభుత్వానికి ఐక్యరాజ్యసమితిలో తత్క్షణమే ప్రాతినిధ్యము కల్పించవలసిన అవశ్యకత కలదు. అమెరికా మరియు తదనుయాయులు యీ సందర్భమున అనుసరించుచున్న విధానము యెంత మాత్రము సరియైనది కాదు,

కుటుంబాని కొక రూపాయి వసూలు

పొదుపు ఉద్యమంద్వారా దేశప్రగతి సాధించాలని కాంగ్రెసు కార్యకర్తలకు శ్రీ కళా ఉద్బోధ

(స్వ. వి)

గుంటూరు, సెప్టెం 22

"మనకు నెల్లపుడు సహకారసాధనాభూతులు చూపేవ్యక్తి ఓటరు అలాంటివ్యక్తికి మన కాంగ్రెసు కార్యకర్తల మూలపట్ల, మన సంస్థపట్ల విశ్వాసాన్ని గలిగించాలి. అది మన ప్రథమ కర్తవ్యం. ధర్మమూను ప్రతి కాంగ్రెసు కార్యకర్తా, తన కర్తవ్యాన్ని, తన ధర్మాన్ని తాను గుర్తించాలి. మన స్ఫూర్తిగా ఈగుర్తింపు అనేది జరిగితే, నిర్వహణ అనేది ఎలాగో దానంతట అది వస్తుంది" అని గత వారంలో ఇండియన్ ఛేంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో జరిగిన జిల్లా కాంగ్రెసు కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రెవిన్యూశాఖా మాత్యులు శ్రీ కళా వెంకట్రావు అన్నారు.

శ్రీ మంతెన వెంకటాజు ఎం. ఎల్. ఏ. సభాధ్యక్షత వహించారు.

గుంటూరు తాలూకా కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ శ్రీనివాసరావు మాట్లాడుతూ, కాంగ్రెసు కార్యకర్త అయిన ప్రతివ్యక్తి కనీసం రోజుకు ఒకగంటసేపయినా కాంగ్రెసు సంస్థ కోసం పనిచేయాలని అన్నారు.

తెనాలి తాలూకా కాంగ్రెసుఅధ్యక్షుడు శ్రీ కోటేశ్వరరావు కమ్యూనిస్టులు కాంగ్రెసును అపనిందలుపాలు చేయాలని చూస్తున్నారనీ, ఏ గ్రామానికి ఆ గ్రామంలో కనీసం ఒక ఐదుగురు కాంగ్రెసు కార్యకర్తలయినా క్రమశిక్షణ పొంది ఒక యూనిట్‌గా తయారు కావాలనీ, అలా అయితే వారు ఏ విధమైన అవాంతరాన్ని అయినా ఎదుర్కొనగల స్థితిలో ఉండగలరనీ అన్నారు.

బాపట్ల తాలూకా కాంగ్రెసు కమిటీ అధ్యక్షులు శ్రీ పాములపాటి ప్రసాదరావు కాంగ్రెసు సంస్థను అడుగునుంచి గట్టిచేసికొంటూ పోవాలని అన్నారు.

మంగళగిరి కాంగ్రెసు కమిటీ అధ్యక్షులు శ్రీ శీరందాసు సాంబయ్య కాంగ్రెసు వారిలో అనైక్యత నశించాలని కోరారు.

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు కమిటీ సభ్యులు శ్రీ శివ్వయ్య వృద్ధాప్యంలో కాంగ్రెసు సంస్థకు సేవజేయం పోయాలని అన్నారు.

పిమ్మట శ్రీ కళా వెంకట్రావు మాట్లాడుతూ ఇలా అన్నారు:

"స్వాతంత్ర్యం సంపాదించటం సులభం అయింది గాని రామరాజ్యాన్ని స్థాపించటం సులభం గావటంలేదు. ఆనాడు ఏ కొన్ని లక్షలమందో కష్టపడ్డారు. గాని ఈనాడు రామరాజ్యానికి ఒక స్వరూపం ఇవ్వటానికి 35 కోట్లు జనాభా కష్టపడాలి. పడకతప్పదు.

ఈనాడు ఉత్తర ప్రదేశ్‌లో ఆహారానికి సంబంధించిన సమస్య, దాంతో ఉత్పన్నమయిన ఆందోళన చాలాతీవ్ర రూపం దాల్చినవి. కొద్దిగా అయినా బియ్యం లభ్యంగాని పరిస్థితులు ఏర్పడినవి. వాటినుంచి దాటి బయటపడటం ఎలా అనేది ఒక సమస్య అయింది.

మనం ఏటా ధాన్యం దిగుమతుల నిమిత్తం ఖర్చుపెడుతున్న నూరునుంచి నూటయాభయికోట్ల రూపాయలు, ఏ నిరుద్యోగ సమస్యా నివారణకో, ఏ ప్రాజెక్టు నిర్మాణానికో, మరి ఏ ఇతర ఉపయోగకరమైన కార్యక్రమానికో ఖర్చుపెడితే, దానివలన మనకు మన దేశానికి ఎంతో ప్రయోజనం ఉంటుంది. కాని అలాంటి దానికి అవకాశం కనపడటంలేదు.

నాగార్జునసాగర్ త్వరగా పూర్తి అయితే కనపడే మంచి ఫలితాలేమో త్వరగా కనపడుతవి. కాని పెట్టుబడి ఎక్కడనుంచి తెస్తాం. విదేశాల నుంచి ఆర్థిక సహాయం మనకు అందరోతున్నది. కాని దానిమీదనే ఎలా ఆధారపడగలం? ఈ ప్రణాళికాకాలం ఇదేళ్ళలో మనం 850 కోట్లు ఖర్చుపెట్టాలి. ఎలా వస్తుంది ఈ పెట్టుబడి విదేశీ సహాయంమాట అలా ఉంచండి. ఇక పోతే పన్నులు, పొదుపు ఉద్యమం ఈ రెండే కర్తవ్యాలు.

పన్నుల విషయం చెప్పాలంటే, 35 కోట్ల ప్రజలలో ఎంతమంది పన్ను చెల్లిస్తున్నారనే విషయం ఆలోచించండి. అంతేగాదు ఎంతమంది లాభం పొందుతున్నారో గూడా ఆలోచించండి.

ఇక పొదుపు. ఇది ఒక్కటే అందరికీ అందుబాటులో ఉన్నది. ఎవరికి శక్తి కొలదివారు ప్రభుత్వానికి అప్పుపెట్టవచ్చు దానిమీద వారికి వడ్డీవస్తుంది. పొదుపు చేయటం అంటే సినీమాలు, సిగరెట్లువంటివాటికి ముఖ్యంగాడబ్బు ఖర్చుపెట్టకుండా ఉండటం. ఈ విధముగా దాచుకొన్నడబ్బువలన తమకు ఉపయోగపడటమేగాక, తమ భావితరాలవారికి ఉపయోగపడుతుంది.

కాంగ్రెసు వర్కర్లు అయిన మీరు సాలుకు ఒక్క రూపాయి చొప్పున ఒక్కొక్క కుటుంబం దగ్గర నుంచి వసూలు చేయండి. ప్రజాబాహుళ్యం నుంచి పొదుపు ఉద్యమంవలన ఫలితాలు కనపడవలసిందేగాని ఏ కొద్ది మంది దగ్గరకోపోతే అంతగా ప్రయోజనం ఉండదు

"కాంగ్రెసు భవిష్యత్తు మన మనో నిశ్చయంమీద మన మనో నిర్ణయం మీద ఆధారపడి ఉన్నది. ఈ నగ్న సత్యం దృష్ట్యా కాంగ్రెసు కార్యకర్తలు పనులను నిర్వహించాలి"

అనంతరం ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ పిడతల రంగారెడ్డి మాట్లాడుతూ, మనం సమైక్యంగా నిలబడితే మనకు మన సంస్థకు బలం అనేది ఎప్పుడూ ఉంటుందనీ 1962లో మనకు బలం పోతుంది అని భయపడనవసరం లేదనీ మన కర్తవ్యం ఏమిటో మనం గుర్తించి దాన్నితుచా తప్పకుండా అమలు జరపాలనీ అన్నారు.

"కాంగ్రెసు సంస్థలో సభ్యులను చేర్పించే విషయంలోగాని కాంగ్రెసు సందేశాన్ని ప్రజలకు వివరించి వారికి నచ్చచెప్పటంలోగాని కాంగ్రెసుకార్యక్రమాలను అమలు జరపటంలోగాని కాంగ్రెసు కార్యకర్తలు నీతి నిజాయితీలతో వ్యవహరించాలి"

మండల కాంగ్రెసు కమిటీలు పటిష్ఠంగా పనిచేయాలనీ, లేకపోతే వాని వలన ప్రయోజనం ఉండజాలదనీ, ఆయా కమిటీలకు రాష్ట్ర కాంగ్రెసు సంఘం సభ్యులను చేర్పించేవిషయంలోగాని, సంస్థకు సంబంధించిన ప్రచార సాహిత్యాన్ని అందచేసే విషయంలోగాని సహాయ పడుతుందనీ అన్నారు.

జరుపనున్న పాదయాత్ర విషయం ముచ్చటిస్తూ ఈ పాదయాత్రలో ప్రతి ఒక్క కాంగ్రెసువ్యక్తి పాల్గొనాలనీ ఈ యాత్రకు ఒక ప్రత్యేక ప్రాధాన్యం ఉన్నదనీ, దానివలన ప్రజలలో వెనుకటికన్నా ఎక్కువ సాన్నిహిత్యాన్ని పెంపొందింప చేసికోవటం సంభవం కాగలదనీ అన్నారు.

ప్రజాస్వామ్య సోషలిజం వ్యవస్థనిర్మాణానికికృషి

పశ్చిమ ఆసియా దేశాలలో జరుగుతున్నదని శ్రీజయప్రకాశ్ వివరణ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 22

పశ్చిమ ఆసియా పరిస్థితిలో చెప్పుకోదగ్గ అంశం అరబ్ జాతీయత పెల్లుబకడమేనని శ్రీజయప్రకాశ్ నారాయణ నిన్న యిక్కడ అన్నారు.

శ్రీజయప్రకాశ్ విలేఖరులగోష్ఠిలో ముచ్చటిస్తూ అరబ్ ప్రపంచ కొత్త నాయకులు ప్రజాస్వామ్యసోషలిజాన్ని గురించి సగర్వంగా మాట్లాడారనీ త్వరితగతిని ఆర్థికాభ్యున్నతిని సాధిస్తూ ప్రజాస్వామ్య పథంలో సోషలిజాన్ని ఎలాని ర్మించుకోవాలన్నదే వారి ప్రధానసమస్యఅని ఆయనన్నారు.

పశ్చిమ ఐరోపా, యుగోస్లేవేకియా, బ్రిటన్, పశ్చిమ ఆసియాదేశాలలో నాలుగున్నర మాసాలపాటుపర్యటించి మొన్ననే భారతదేశానికి తిరిగివచ్చిన శ్రీజయప్రకాశ్ పశ్చిమ ఆసియా పరిస్థితి సక్రమంగా అర్థంచేసుకోబడలేదనీ పశ్చిమదేశాలపత్రికలన్నీ తప్పుడు వ్రాతలే దీనికి చాలావరకూ బాధ్యతవహించాలనీ శ్రీజయప్రకాశ్ అన్నారు ఈజిప్టు ఇరాన్, లెబనాన్‌లలోని వాస్తవ పరిస్థితి తాను పశ్చిమదేశాల పత్రికలలో చదివినదానికంటె భిన్నంగాఉన్నదని ఆయనన్నారు

నాసర్ నియంతగా పశ్చిమదేశాల పత్రికలు పేర్కొంటున్నవి అది నిజం కాదు

పశ్చిమ ఆసియాదేశాలకు కొంతవరకూ భారతదేశానికీ-పశ్చిమదేశాలలోని పార్టీ విధానం సరిపడదనిఆయన న్నారు. అందువలన ఆ దేశాలప్రభుత్వ వ్యవస్థలు మాస్కుకు గురవుతున్నవి.

సాధ్యమైనంత తొందరగా ప్రజాస్వామ్య సోషలిస్టు వ్యవస్థను ప్రవేశపెట్టాలనేదే పశ్చిమ ఆసియా దేశాల సంకల్పమని ఆయనన్నారు. ఈ దేశాలలో కార్మికోద్యమాలులేవు, వ్యవసాయదేశాలు.

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షునిపైకం దొరికింది

(స్వ వి.)

గుంటూరు, సెప్టెం 22

రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ పిడతల రంగారెడ్డి జిల్లా కాంగ్రెసు వారు ఇండియన్ చేంబరు భవనంలో ఏర్పాటుచేసిన కాంగ్రెసు వర్కర్ల మహాసభలో ఉపన్యసించి క్రిందికి దిగి వచ్చినపుడు వారిజేబులో నుంచి రు 1800 గల పర్సును ఎవరో ఒకదొంగ దొంగలించినసంగతి పాఠకులకు విదితమే

ఈ కేసును గుంటూరుకైం బ్రాంచి ఇన్‌స్పెక్టర్ శ్రీ బి. వెంకటరావు రసూలుపేట పోలీసు స్టేషన్‌లో రిజిస్టరుచేసి 17వ తేదీన గుంటూరు నివాసి అయిన ఏనుగుల చిట్టిఅను జేబు దొంగను పట్టుకొని అతనిపై దగల రు—1615 లను వశపరచుకొన్నారు. ఈ కేసులో శ్రీ బి. వెంకటరావుకు క్రైం బ్రాంచి ఎస్ ఐ బి తుమీదాసు ప్రభృతులు సహకరించారు.

తాజ్ మహల్‌కు మరమ్మతులకై 56 వేల ఖర్చు

న్యూఢిల్లీ, సెప్టెం 21

జనవరి లగాయతు ఆగస్టు మాసాంతం వరకు, తాజ్‌మహల్ మరమ్మతుల క్రింద 56,812 రూ లు ఖర్చు అయిందని వైజ్ఞానిక పరిశోధనా సాంస్కృతిక వ్యవహారాల మంత్రి శ్రీ హుమాయూన్ కబీర్ లోకసభలో శ్రీ సంగార్కర్ ప్రశ్నకు లిఖితంగా జవాబిస్తూ చెప్పారు తాజ్‌మహల్‌కు మరమ్మతులు యింకా పూర్తి కాలేదని కూడా ఆయనఅన్నారు.

ఆంధ్రప్రదేశ్ వ్యాపారమహాసభ

నవంబర్ 29, 29, 30 తేదీలలో జరగాలని ఆక్ట్రాయి, వృత్తిపన్ను నిరసన కమిటీ సర్వసభ్య సమావేశం నిర్ణయించినది.

నల్లగొండజిల్లా అభివృద్ధి బ్లాకులు

గ్రామనాయకుల ప్రతినిధివర్గంచే సందర్శన

నల్లగొండ, సెప్టెం 22

గ్రామ నాయకులతో కూడిన ఒక ప్రతినిధివర్గం సెప్టెంబరు 13, 14 తేదీలలో నల్లగొండ జిల్లాలోని కొన్ని బ్లాకులను సందర్శించి అక్కడి కార్యకలాపాల్ని పరిశీలించింది. ఈ ప్రతినిధివర్గం భువనగిరి రాగానే బ్లాక్ డెవలప్‌మెంటు ఆఫీసర్ ప్రభృతులు స్వాగతమిచ్చారు.

భువనగిరి బ్లాకులోని కొన్ని గ్రామములను సందర్శించి ఆ తరువాత పెద్ద కమ్యూనిటీ అభివృద్ధిబ్లాకుకు వెళ్లారు. భువనగిరికి తిరిగి వచ్చేముందు నాగార్జున సాగర్ డాంను కూడ సందర్శిస్తారు.

అభివృద్ధి బ్లాకులలో జరుగుతున్న కృషిని వారు అభినందించారు.

సహ విద్యావిధానం

అవసరమని శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్ భావం

భోపాల్, సెప్టెం 22

కేంద్ర సాంఘిక సంక్షేమ బోర్డు అధ్యక్షురాలు శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్ ప్రాథమిక, సెకండరీదశలలో కూడ సహ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టడం వలన బాల బాలికల మధ్యఉండే నిరంతర "వైరం" తొలగిపోతుందని అన్నారు.

సాంస్కృతిక కార్య కలాపాలకు ప్రత్యేక ప్రాధాన్యం యివ్వాలని ఆమె అన్నారు.

.....

మాజీ ఇరాక్ ప్రధానికి మరణశిక్ష

బాగ్దాద్, సెప్టెంబర్ 21

సిరియాపై కుట్రపన్నిన నేరానికి ఇరాక్ మాజీ ప్రధాని ఫదిల్ జమలికి బాగ్దాద్ మిలటరీకోర్టు నేడు మరణశిక్షను విధించినది.

రష్యాలో విద్యావిధానం పునర్వ్యవస్థీకరణ

కృశ్చేవ్ ప్రతిపాదనకు పార్టీ ప్రెసిడియం అంగీకారం

మాస్కో, సెప్టెం 22

సోవియట్ యూనియన్‌లో విద్యావిధానాన్ని పునర్వ్యవస్థీకరించడానికి ప్రధాని నికితా కృశ్చేవ్ కావించిన ప్రతిపాదనను నిన్న సోవియట్ కమ్యూనిస్టుపార్టీ ప్రెసిడియం ఆమోదించింది. ఇంకా యీ పునర్వ్యవస్థీకరణకు సంబంధించిన చట్టం అమోదింపబడాల్సిఉంది. కొన్ని సవరణలతో చట్టం తయారు చేయబడుతుంది.

అద్యతన భావిలో ప్రతి యేటా దేశావసరమైన కార్యక్రమాల్లోపాల్గొడానికి అనువుగా మూడున్నర మిలియన్ల యువకులను సిద్ధపరచడానికి వీలుగాను, కమ్యూనిస్టు సమాజానికి అవసరమైన సైద్ధాంతిక ప్రాయోగికానుభవాలతో వచ్చే 10 సంవత్సరాల్లోగా 40 మిలియన్ ప్రజలకు సెకండరీవిద్య గరపేందుకువీలుగాను ప్రస్తుత విద్యావిధానం పునర్వ్యవస్థీకరింపబడాలని కృశ్చేవ్ భావిస్తున్నాడు.

ప్రతివారికీ ఉచితవిద్యా బోధనను అభిలషించేందుకై విశ్వజనీన బోధనావ్యవస్థల్ని ఏర్పాటు చేయాలనీ నిరక్షరాస్యతను తొలగించాలనీ 1917 నుండిరష్యా ప్రభుత్వం తీవ్రంగా కృషిచేస్తున్నది

నిజంచెబితే నిష్ఠుర మన్నట్లుంది

కృశ్చేవ్ లేఖను ఐసెనుహోవర్ తిరస్కరించినందుకు టాస్ వ్యాఖ్యానం

మాస్కో, సెప్టెం 22

ఫార్మోజా జలసంధి సమస్యను గురించి ఐసెన్‌హోవర్‌కు రష్యా ప్రధాని కృశ్చేవ్ పంపినలేఖ తిరస్కరింప బడినదంటే రష్యా హేతువాదాన్ని అమెరికా పరిపాలకులు వినడానికి నిరాకరిస్తున్నారని వ్యక్తమవుతున్నట్లు టాస్ వార్తాసంస్థ వ్యాఖ్యానించింది. ప్రపంచంలో యుద్ధప్రమాదానికి దారితీయగల సాయుధ కల్లోలాల్ని నిరోధించాలన్న ప్రపంచ ప్రజాభిప్రాయాన్ని అమెరికా ఎంతగా నిర్లక్ష్యం చేస్తున్నదో యీ సంఘటనవల్ల ఉదాహరింప బడవచ్చునని కూడా టాస్ పేర్కొన్నది. అంతర్జాతీయ సమస్యల్ని శాంతియుతంగా పరిష్కరించే మార్గాల్నికూడా అమెరికా నిరాకరిస్తున్నదన్న మాట అని ఆవార్తా సంస్థ భావించింది.

బహుశా నిజంచెబితే నిష్ఠురమన్న సామెత అమెరికా అధికారవర్గాల వద్ద బాగా పనిచేసిందని టాస్ తన ప్రకటనలో అన్నది

సోవియట్ రష్యా ఎల్లప్పటికీ ప్రపంచ శాంతికై కృషిచేసి సత్యాన్నే వక్కాణించగలదని టాస్ ప్రకటించినది.

ప్రావ్దా వ్యాఖ్య

సోవియట్ ప్రధాని లేఖను ఐసెన్‌హోవర్ తిరస్కరించడం ప్రాథమిక ప్రజాస్వామ్య నిబంధనలను మర్యాదలను అతిక్రమించడం కన్న వేరుకాదని ప్రావ్దా పత్రిక నేడు వ్యాఖ్యానించింది. అంతర్జాతీయ తీవ్రతను మరింత పెంచాలని కోరేవారి ఆదేశం ప్రకారం యీ తిరస్కృతి జరిగిందనీ లాజ్యాతీమధ్య విద్వేషాన్ని రెచ్చగొట్టడానికి తీసుకోవలసిన అనిచర్యలూ తీసుకోడానికి అమెరికా అధికారులు వ్యతిరేకులు కారని తేలుతున్నదనీ ఈ వ్యాఖ్యానంలో పేర్కొనబడింది ఈ చర్య తాము తీసుకున్న గోతిలో తామే పడే పరిస్థితికి దారితీస్తుందని వాషింగ్టన్ నాయకులు గుర్తించకుండా కళ్ళుమూసుకు వ్యవహరిస్తున్నారనీ కూడా ప్రావ్దా తెలిపింది

ప్రావ్దాలో "ది అబ్జర్వర్" అను పేరుతో వ్రాయబడిన యీ వ్యాఖ్యను టాస్ వార్తాసంస్థ విడుదల చేసింది.

సెల్విన్‌లాయడ్‌తో ఐక్ చర్చలు

ఫార్మోజా జలసంధి వ్యవహారంపై

న్యూపోర్ట్, రోడ్ ఐలెండ్, సెప్టెం 22

ఫార్మోజా జలసంధి ప్రాంత సమస్యను గురించి నిన్న ప్రెసిడెంటు ఐసెన్‌హోవర్ బ్రిటిష్ విదేశాంగ మంత్రి సెల్విన్‌లాయడ్, అమెరికాలోని బ్రిటిష్ రాయబారి సర్ హెరాల్డు కాథియాలతో చర్చలు జరిపారు. వారిరువురూ ఐసెన్‌హోవర్‌ను కలియడానికి ఇక్కడికి వచ్చారు.

వీరు ముగ్గురూకలిసి ఫార్మోజా జలసంధి సమస్యను చర్చించారని ప్రెస్ సెక్రటరీ జేమ్స్ హాగర్టీ తెలిపాడు.

శ్రీల విద్యావ్యాప్తి

వారిని వెనుకబడిన తరగతుల జాబితాలో చేర్చాలని శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్ విజ్ఞప్తి

భోపాల్, సెప్టెం 22

శ్రీ విద్య జాతీయ కమిటీ అధ్యక్షురాలు శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్ నేడిక్కడ విలేఖరుల గోష్ఠిలో ముచ్చటిస్తూ ప్రత్యేకంగా శ్రీ విద్యను గురించి చూడడానికి రాష్ట్రాలలో ప్రత్యేక శాఖల్ని నెలకొల్పాలని కోరారు.

శ్రీ విద్యాభివృద్ధికి కేటాయించబడిన 803 లక్షల రూపాయలలో 90 వేలు మాత్రమే ఖర్చయినవని ఆమె అన్నారు. తృతీయ పంచవర్షప్రణాళికలో శ్రీ విద్యావ్యాప్తికి ప్లానింగ్ కమిషన్ 15 నుండి 20 కోట్ల రూపాయలను కేటాయించాలని ఆమె కోరారు.

శ్రీలను వెనుకబడిన తరగతుల జాబితాలో చేర్చి వారి విద్యాభ్యాసానికి తగు సౌకర్యాల్ని కల్పించవలసిందిగా ఆమె భారత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

శ్రీలు వెనుకబడినవారని వెనుకబడిన తరగతుల కమిషన్ పరిగణించినందున వారిని వెనుకబడిన తరగతుల జాబితాలో చేర్చడంలో ఏమీ ఇబ్బంది ఉండదని ఆమె అన్నారు ఇదేజరిగితే శ్రీ విద్యావ్యాప్తికి చాల దోహదము జరుగుతుందని అన్నారు.

దీర్ఘ జీవిత రహస్యం

111వ జన్మదినోత్సవం జరుపుకొన్న శ్రీ వెల్లడి

నైరోబి, సెప్టెం 22

భారతదేశంలో జన్మించిన శ్రీమతి హాఫిజ్ కరి పయ్యద్ అహ్మద్ నేడు తన 111వ జన్మదినోత్సవాన్ని జరుపుకొన్నది ఆమె ఈ నగరంలో కేవలం వాలుగు పెంట్లుఉన్న కాలంలో నైరోబీ వచ్చింది.

ఆమె రోజుకు 10 సిగరెట్లు కాలుస్తుంది. దీర్ఘరైలు ప్రయాణాలు, రేడియో వినడం, తన 87 గురు మనమలు, మనమరాండ్రతో మాట్లాడటం తనకు ఎక్కువ యిష్టమని ఆమె అన్నది.

"ఏ విషయం గురించీ దిగులు పడకూడదు" అనేదే తన దీర్ఘజీవిత రహస్యమని ఆమె అన్నది.

పట్టంచేరు బ్లాకులో ఎం.పిలు. ఎం.ఎల్.ఏల పరిశీలన శిబిరం

నవంబరులో వారంరోజులపాటు నిర్వహణ

హైదరాబాద్, సెప్టెం 22

పార్లమెంటు సభ్యులు, రాష్ట్ర శాసనసభ్యుల సౌకర్యార్థం వచ్చేనవంబరులో కేంద్రప్రభుత్వ కమ్యూనిటీ అభివృద్ధి మంత్రిత్వశాఖ ఆధ్వర్యాన కమ్యూనిటీ అభివృద్ధి పరిశీలన శిబిరం ఒకటి నిర్వహింపబడగలదు.

హైదరాబాద్ నగరానికి 16మైళ్ళ దూరానగల పటంచేరు బ్లాకు ప్రస్తుతానికి యీ శిబిర కేంద్రంగా ఎన్నుకోబడింది. శిబిరం ఒక వారందివాలపాటు నిర్వహింపబడుతుంది. ప్రధమంగా ఇక్కడ 85 గురు పార్లమెంటు సభ్యులు, (వివిధ రాష్ట్రాల్లోని వివిధ రాజకీయ సంఘాలవారు), 50 మంది ఆంధ్రప్రదేశ్ శాసనసభ్యులు యీ శిబిరంలో పాల్గొంటారు.

.....

అల్జీరియా స్వతంత్ర ప్రభుత్వాన్ని గుర్తించడానికి జోర్డాన్ నిర్ణయం

అమ్మాన్, సెప్టెం 22

అల్జీరియా రిపబ్లిక్ (స్వతంత్ర) తాత్కాలిక ప్రభుత్వాన్ని గుర్తించడానికి జోర్డాన్ ప్రభుత్వం నిశ్చయించింది.

గతరాత్రి జోర్డాన్ మంత్రివర్గం సమావేశమైనప్పుడు యీ నిర్ణయం తీసుకోబడింది. ఈ సమావేశం సాధారణ సమావేశమేగాని ప్రత్యేక సమావేశం కాదు

గ్రామ ప్ర

ఇండియా క్రికెట్ కంట్రోల్ బోర్డు

నూతన అధ్యక్షునిగా ఆర్. కె. పాటిల్ ఎన్నిక

హైదరాబాద్, సెప్టెంబరు 21

ఇండియా క్రికెట్ కంట్రోల్ బోర్డు నేడు ఇక్కడ జరిగిన వార్షిక సమావేశంలో నూతన అధ్యక్షునిగా ఆర్. కె. పాటిల్‌ను ఎన్నుకొన్నది.

ఈ బోర్డు అధ్యక్షుడుగా ఉన్న సర్దార్ భూపిందర్ సింగ్ మరియా స్థానానికి ప్రతిపాదించారు. లాలా అమర్‌నాథ్ సెలక్షన్ కమిటీ చైర్‌మన్‌గా తిరిగి ఎన్నికయినారు. సి. రామస్వామి (మద్రాస్), దులారాయ్ (బెంగాల్), ఎల్-పి జై (బొంబాయి) ఈ కమిటీ సభ్యులు. సెలక్షన్ కమిటీ సభ్యత్వానికి మొత్తం తొమ్మిదుగురు పోటీ చేశారు. 28 ప్రాంతీయ క్రికెట్ సంఘాలలో 25 సంఘాల ప్రతినిధులు ఈ వార్షిక సమావేశానికి హాజరయినారు

దోపిడి దొంగలచే యిద్దరి హత్య

గయ, సెప్టెం 21

సత్యనారాయణసింగ్ అనేవానిని, అతని కోడలిని పోలీసులు (గ్రామములో గత గురువారం రాత్రి) దోపిడి దొంగలు హత్యచేసి అనేక వేల రూపాయల విలువైన ఆభరణాలు తీసుకొని పోయారు. 8 సంవత్సరాల బాలుడికి స్వల్పంగా గాయాలు తగిలినవి.

కేరళరాష్ట్ర సంఘం తన ప్రతినిధుల పంపలేదు ఈ సారు అంపైరింగ్ కోచింగ్ మరియు టోర్నమెంటులను చేర్చేరు కమిటీల ఏర్పాటవనది. బోర్డు కార్యవర్గంలో ఇంకా ఈ విగువవారున్నారు:

ఉపాధ్యక్షులు ఎమ్. ఎ. చిదంబరమ్ (మద్రాస్), ఐ ఎస్ నంజ్‌వాని (బరోడా), జస్టిస్ పి కె మిత్తర్ (బెంగాల్) రాజా భాలిందర్ సింగ్ (పాటియాలా) వి. కె దివేకా (బొంబాయి) కార్యదర్శి ఎ ఎస్. ఘోష్ సహాయ కార్యదర్శి చిన్నస్వామి కోశాధికారి జడ్. ఆర్. ఇరాని.

రోడ్డు రవాణా పునర్‌నిర్మాణ కమిటీ

హైదరాబాదుకు ఒక జట్టురాక

హైదరాబాద్, సెప్టెంబరు 21

ఇండియన్ రోడ్ (ట్రాన్స్‌పోర్టు అభివృద్ధి సంఘ కార్యదర్శి సి ఎస్. నాయర్ ఆలిండియా మోటార్ (ట్రాన్స్‌పోర్టు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కుందన్‌లాల్ నేడు హైదరాబాద్‌కు వచ్చారు. రోడ్డురవాణా పునర్ నిర్మాణ కమిటీ యొక్క మరో ఇద్దరు సభ్యులు రేపుగాను న్నారు.

కేంద్రప్రభుత్వంఎమ్.ఆర్.మాసాని ఎం పి. అధ్యక్షతన మోటార్ రవాణా పునర్ నిర్మాణానికై తగుసూచనలు చేయుటకు ఈ సంఘాన్ని ఏర్పరచినది. దీనిలో మొత్తం పదిమంది సభ్యులు కలరు వీరు రెండు జట్టులుగాచీలి ఉత్తర దక్షిణ రాష్ట్రాల పర్యటిస్తున్నారు.

వీరు హైదరాబాద్ మోటార్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఖుర్షీద్ హసన్‌తో కలసి నేడు రోడ్ ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్ ఆఫీసర్లతో సంభాషించి జాతీయం చేయబడిన ఈ పరిశ్రమ ఎలా నిర్వహింపబడుచున్నది గ్రహించారు. ఈ కమిటీ యొక్క పదిమంది సభ్యులు మద్రాసులో అక్టోబర్ 30 నుండి నవంబర్ 2 వరకు సమావేశం కాగలరు.

సంస్కృత పరీక్షల పరిగణన, ప్రమాణీకరణ దరఖాస్తు తేదీ పొడిగింపు

న్యూఢిల్లీ, సెప్టెం 22

సాంప్రదాయక సంస్కృత విద్యా పరీక్షల, డిప్లొమాల ప్రమాణీకరణ పరిగణన విషయమై దేశంలోని సంస్కృత విద్యా సంస్థలు దరఖాస్తులు అందచేయవలసిన ఆఖరు తేదీని జూలై 31 నుంచి అక్టోబరు 20 వరకు పొడిగించడం అయింది. ఇండియా ప్రభుత్వానికి అనేక సంస్కృత విద్యా సంస్థలు అందచేసిన విజ్ఞప్తులను పురస్కరించుకుని ఇలా నిర్ణయించడం జరిగింది.

ఈగడువును మళ్లీయింకా పొడిగించడంజరగదు.

దరఖాస్తుఫారాలను అండర్ సెక్రటరీ, హిందీ డివిజన్, విద్యా మంత్రిత్వశాఖ ఇండియా ప్రభుత్వం న్యూఢిల్లీకి వ్రాసి తెప్పించుకొనవచ్చును.

దరఖాస్తు ఫారాలతోటు 5 ప్రతులను పూర్తిచేసి పంపాలి.

గోహత్యా వ్యతిరేక ఉద్యమం

చుడీబజార్ బస్తీ, కాంగ్రెస్ మాజీఅధ్యక్షులు శ్రీసిద్ధమూర్తి పత్రికటన

హైదరాబాద్, సెప్టెం 22

(శ్రీ) సిద్ధమూర్తి చుడీబజార్ బస్తీ కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షులు ఈ దిగువ పత్రికాప్రకటనచేస్తున్నారు:

ఆంధ్రప్రదేశ్‌లో గోహత్యా నిరోధానికై (శ్రీ) రామచంద్రవీర్ నిరశన దీక్షను ప్రారంభించి నేటికి 30 రోజులయినది. వీరు ఈనిరశనదీక్షనుప్రారంభించినవాటినుండి పత్రికలలో గోవధ నిరోధాన్ని బలపరుస్తూ పలువురుసోదరులు ప్రకటనలుచేసి తమ అభిప్రాయముల వెల్లడించుటయేకాక ముస్లిం సోదరుడు తురాబ్ అలీహైదర్ తాను రామచంద్రవీర్ నిరశనదీక్షకు సానుభూతి సూచకంగా ఉపవాసవ్రతాన్ని ప్రారంభించగలమని ప్రకటనచేశాడు. ఇందువల్ల ఇది ఒక్క హిందువులకు సంబంధించిన సమస్యమాత్రమేకాదని ముస్లింలుగూడా గోవధనిషేధాన్ని బలపరుస్తున్నారని స్పష్టమవుచున్నది. అయినా ఈ సందర్భములోకొందరు స్వార్థప్రయోజనాలకాంక్షించి గోవధ నిరోధానికి వ్యతిరేకంగా పనిగట్టుకొని పనిచేస్తుండటం విచారకరము. ఇట్టి వ్యక్తి మరెవరోకాదు (శ్రీ) శంకర్ లాల్ గాయక్వాడ్. వీరు కాంగ్రెస్ సభ్యులేకాక కాంగ్రెస్ టికెట్టుపై హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు ఎన్నికయినారు. జనరల్ ఎన్నికల సమయంలో తాము కాంగ్రెస్ వాదిఅయి ఉండి తమ ఇంటిలో అధికార కాంగ్రెసు అభ్యర్థికి వ్యతిరేకంగా కమ్యూనిస్టుపార్టీవారిని తరిమివేసి రులను కూడగట్టి ప్రచారంచేస్తుండగా నగర కాంగ్రెస్‌కమిటీ గ్రహించివీరిని కాంగ్రెస్ సంస్థనుండి తొలగించుటకు అభిప్రాయపడుటయేకాక తీర్మాన రూపకముగా ప్రదేశ్ కాంగ్రెస్‌కు నివేదించినది. కాని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ దీనిపట్టించుకొనలేదు దీనివల్ల వీరికి మరింత ప్రోత్సాహము లభించినట్లయి మజ్లిస్ ఇత్తెహాదుల్ ముసల్మీన్ పునరుద్ధరింపబడగా దాని కార్యకలాపములను బలపరుస్తూ పత్రికలలో ప్రకటనచేశారు. వీరిచర్యలవల్ల కాంగ్రెస్ సంస్థపేరు ప్రతిష్ఠలకు తీరని నష్టంకలుగుచున్నది. నగరకాంగ్రెస్ కమిటీ అధ్యక్షులగు (శ్రీ) నర్సింగ్ ప్రసాద్ జైస్వాల్‌గారు రాత్రింబవళ్ళు ఇక్కడ కాంగ్రెస్ సంస్థకు బలాన్ని చేకూర్చుటకయి కృషిచేస్తున్నారు. నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇత్తెహాదుల్ ముసల్మీన్ కార్యకలాపముల గర్హించుటయేకాక దానిని ఖండిస్తూ నగరకాంగ్రెస్ కమిటీతో తీర్మానముచేయించారు ముస్లింప్రజలు తిరిగి దీని మోసపు ప్రచారానికి గురికారాదని కోరారు. నగర కాంగ్రెసు కమిటీ ఇంతచేస్తూ కాంగ్రెస్ సభ్యుడగు (శ్రీ)శంకర్ లాల్ గాయక్వాడ్ ప్రవర్తనను సరిచేయుటకు ముందుకు వచ్చుటలేదు ఇందువల్ల కాంగ్రెసు సంస్థకే నష్టముకలుగుచున్నది. ఇప్పుడో (శ్రీ)శంకర్ లాల్ గాయక్వాడ్ గోరక్షణ ఉద్యమాన్ని మతసంబంధమైనదిగా చిత్రిస్తూ గోవధను సమర్థిస్తూ ప్రచారంచేస్తున్నారు. కేవలం వీరుగోవధను సమర్థిస్తూ ఉండినా నాకుఎట్టి ఆక్షేపణ ఉండకపోయేది. నేటి ప్రజాస్వామ్యములో భావప్రకటనకు పూర్తిస్వాతంత్ర్యంఉంది వీరు మాంసాహారముల సిద్ధంచేయు హోటళ్లనుండి వేలరూపాయల వసూలుచేసి ముస్లింలనుగోవధకు అనుకూలంగా ఆందోళన చేయుడని ప్రేరేపిస్తున్నారు. గోరక్షణకు వ్యతిరేకిస్తున్నారు. స్వార్థ ప్రయోజనాల ఆశించి గోవధనిషేధ ఉద్యమంవల్ల కసాయివారికి, చర్మకారక పరిశ్రమకు, దానిపై ఆధారపడిఉన్నవారికి నష్టంకలుగగలదని బూటక ప్రచారం చేస్తున్నారు కొనసకు వీరి ప్రచారం ఇంతవరకు పోయినదికదా? గోరక్షణను వ్యతిరేకించుటకయి ఒక అడ్‌హాక్ కమిటీని ఏర్పరచుటకు ప్రేరేపించారు. వీరి ప్రవర్తనను ప్రజానీకం పరిగణించుకొనడమేకాక దీని ప్రభావం కాంగ్రెస్‌పైనను పడుచున్నది. (శ్రీ)గాయక్‌వాడ్‌గారు తమ నియోజకవర్గ ఎన్నికల సందర్భంగా ఒక దేవాలయాన్ని అక్రమంగా ఆక్రమించుకొన్నారు దీనినిగూర్చి ప్రభుత్వ అధికారులకు దేవాదాయశాఖ వారికి తెలిపినా వారుగూడా ఇంతవరకు ఎట్టి చర్యతీసుకొనలేదు ఈ విధంగా వీరి చర్యలు బలపడుచున్నవి. కాంగ్రెస్ పేరుతో తమ పాశబల్యాన్ని పెంచుకొంటున్నారు. కావున ఇట్టి అవాంఛనీయ శక్తులకు కాంగ్రెసులో స్థానముండరాదు వీరిని ఎంతత్వరగా తొలగిస్తే సంస్థకు అంతలాభము. శ్రీరామచంద్రవీర్ ఏకాశయముతో దీక్షను కొనసాగిస్తున్నారో ఆ ఆశయము త్వరలో పూర్తిఅగుగాక!

సంస్కృతంలో పత్రిక

సాహిత్య అకాడమీ సంకల్పం

న్యూఢిల్లీ, సెప్టెం 22

సాహిత్య అకాడమీ వారు సంస్కృతంలో ఒకపత్రికను వెలువరించడానికి సంకల్పించారని వైజ్ఞానిక పరిశోధనా సాంస్కృతిక వ్యవహారాల మంత్రి శ్రీ హుమాయూన్ కబీర్ లోకసభలో శ్రీ బి. మాలవియాకు జవాబుగా చెప్పారు. ఈ పత్రిక ఆరు నెలలకు ఒకసారి వెలువడుతుందనీ, మద్రాసు విశ్వవిద్యాలయంలో పని చేస్తున్న డాక్టరు వి. రాఘవన్ దీనికి సంపాదకత్వం వహిస్తారనీ ఆయన వివరించారు.

రేడియో

హైదరాబాద్ - ఎ

బుధవారం, సెప్టెంబర్ 24

405.4 మీ (740 కిలోసై)

ఉ॥ 6-50 సుప్రభాత్ (భ), 7-00 తె-వా, 7-15 మంచిరాజు సత్యనారాయణమూర్తి (విజయవాడ నుండి రిలే). 7-45 లలిత సంగీతము (భ), 8-00 ఆం-వా, 8-15 హిం-వా, 8-30 కర్ణాటక సంగీతపాఠము, 8-45 కార్యక్రమ వివరణ (ఉర్దూ), షేక్ దావూద్; తబ్‌లా, 9-00 ప్రసార సమాప్తి.

మ॥ 12-30 ఘజల్ (భ), 1-00 కన్నడ కార్యక్రమం, 1-30 వి- బాల సుబ్రహ్మణ్యభాగవతర్, 1-50 తె-వా 2-00 సుగమ్ సంగీత్ (భ), 2-10 ఉ-వా, 2-20 ఉన్నత పాఠశాలవిద్యార్థులకు శబ్దసంచయము, మానవాభ్యుదయము ప్రసంగము, హిందీ పాఠం, 2-50 వినామ సంగీతము (భ), 3-00 మాధ్యమిక పాఠశాల విద్యార్థులకు, 3-30 నిశాన్: నిలయ విద్యాంసుడు, 3-45 పాఠశాలలకు [ఉర్దూ]. 4-15 వాతావరణసూచన, ప్రసారసమాప్తి.

సా॥ 6-00 స్థానిక ప్రకటనలు, 6-05 ప్రాంతీయ వార్తలు, 6-15 గ్రామసీమ, విశేషాలేమిటి? యెంకిపాట, కావ్యపరిచయము: కాళహస్తిమాహాత్మ్యం ప్రసంగం,'మాకూ ఉన్నాయి స్వగతాలు' పొగాకుపంట ప్రసంగం, ప్రకటనలు, ధరలు, వాతావరణము, 7-00 తె-వా, 7-15 గ్రామసీమ దోణపర్వమునుండి పురాణకాలక్షేపము. 7-30 భక్తుకజాతులు ప్రసంగము కె- వెంకటరాజు (మద్రాసు నుండి రిలే), 7-40 ప్రకటింపబడును 8-00 కుదరనిసంబంధం నాటిక రచన; కొ. కుటుంబరావు (మద్రాసు నుండి రిలే). 8-30 ఢిల్లీ నుండి రిలే, 8-50 సుగమ్ సంగీత్ (భ) 9.00 ఆం-వా, 9-15 ఉ-వా, 9-30 వి. బాల సుబ్రహ్మణ్య భాగవతర్, 10-00 ఘులాం మహ్మద్ ఖాన్: సారంగి, 10-30 వాతావరణ సూచన, ప్రసారసమాప్తి

హైదరాబాదు- బి.

42.02 మీ (7140 కిలోసై)

ఉ॥ 6-50 హైదరాబాదు- ఎ వలె, 8-15 వయొలిన్; నిలయవిద్యాంసుడు 8-30 హైదరాబాద్ ఎ వలె 9-00 ప్రసార సమాప్తి.

30.86 మీ (9720 కిలోసై)

మ॥ 12-30 హైదరాబాదు-ఎ వలె. 1-00 శాస్త్రీయ సంగీతము (భ), 1-30 హైదరాబాద్ ఎ వలె, 2-00 లయవిన్యాసం: నిలయ విద్యాంసుడు, 2-20 హైదరాబాద్ ఎ వలె 3 45 గాత్రసంగీతము: నిలయవిద్యాంసుడు, 4-15 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి

60.14 మీ (4988 కిలోసై)

సా॥ 6-00 హైదరాబాదు- ఎ వలె 6-15 విజయమూరి వరదరాజ అయ్యంగార్ [భ], 10-00 హైదరాబాద్- ఎ వలె, 10-30 వాతావరణ సూచన ప్రసార సమాప్తి.

విజయవాడ

357.1 మీటర్లు (840 కిలోసై)

ఉ॥ 6-30 శుభోదయం, 6-35 ప్రసార తరంగిణి, 6-40 భక్తిరంజని: రామదాసు కీర్తనలు, 7-00 తె-వా, 7-15 మంచిరాజు సత్యనారాయణ మూర్తి, 7-45 సంగీత శిక్షణ, 8.00 ఆం-వా, 8-15 హిం-వా, 8-30 ప్రసార సమాప్తి.

మ॥ 1-00 వాద్య సంగీతము (భ), టి-ఎన్- రాజరత్నంపిళ్ళై: నాదస్వరం 1-30 ఆకాశవాణి రికార్డులు, 1-40 హిం-వా, 1-50 తె-వా, 2-00 క్లారినెట్: నిలయవిద్యాసుడు 2-20 ఉన్నత పాఠశాలల విద్యార్థులకు (హైదరాబాద్ నుండి రిలే), 2-50 క్లారినెట్: నిలయ విద్యాంసుడు, 3-00 మాధ్యమిక పాఠశాల విద్యార్థులకు, 3-30 వాతావరణసూచన, ప్రసారసమాప్తి.

సా॥ 6-00 స్థానిక ప్రకటనలు, 6-05 ప్రాంతీయ వార్తలు, 6- 15 గ్రామస్థుల కార్యక్రమము, 7.00 తె-వా, 7-15 గ్రామస్థుల కార్యక్రమం 7-30 ప్రసంగము (మద్రాసు నుండి రిలే), 7-40 ఫిల్మ్‌గీతాలు (భ), 8.00 నాటిక (మద్రాసు నుండి రిలే). 8-30 ఢిల్లీనుండి రిలే, 8-50 పటతోష్ కిల్ వయొలిన్ (భ), 9-00 ఆం-వా, 9 15 మంచిరాజు సత్యనారాయణ మూర్తి. 10-00 విజాతీయము (ఎ-భ) వాసా కృష్ణమూర్తి, అయ్యగారి సోమేశ్వరరావు, రామవరపు సుబ్బారావు, 10-30 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి

కవి సమ్మేళనాలవల్ల సాహిత్యపు విలువలు తెలియడంలేదు

హనుమకొండలో జరిగిన విద్యావిషయక గోష్ఠిలో అభిప్రాయం

హనుమకొండ, సెప్టెం 22

(శ్రీ) ప్రమోదగణేశలాలే (సంస్కృత భాషోపన్యాసకులు ఓరుగల్లు కళాశాల) గృహమున ఒక విద్యావిషయక గోష్ఠి యీ నెల 22వ వారమున జరిగినది

సమావేశము (శ్రీ) చొల్లేటి నరసింహశర్మ ప్రారంభించారు కవిసమ్మేళనములద్వారా ఉన్నత సాహిత్యపు విలువలు సాధించలేక పోతున్నామని కవి పరిపూర్ణ వ్యక్తిత్వముబహుసూక్ష్మమైన కాలంలో బహిర్గతం కాలేకపోతున్నదనీ ఆయన అభిప్రాయపడ్డారు అందుకని ఒక మిత్రమండలి లాంటిది ఏర్పడి నెలరోజులలో మారుగాని పక్షంరోజులకొక మాటుగానైనా చర్చా సమావేశాలు జరుగాలని ఒక్కొక్కరి రచనలు విపులంగా విమర్శాత్మకంగా పరిశీలింపబడాలని ఆయన సూచించారు. (శ్రీ)యుతులు ఉదయరాజు శేషగిరిరావు, వెంకటాచార్యుల (కామాయని అనువాదము)వంటి వారి కావ్యములు దోహదములేక కుంటువడుతున్నాయని ఆయన విచారం వెలిబుచ్చారు.

ఇదివరకే ఏర్పడి పనిచేస్తున్న నవ్యకళా సమితికి అన్ని భాషలకు ప్రాతినిధ్యం వహించడంలేదని అన్ని భాషల సంగమం లాంటిదొక సమితి ఏర్పడి అన్ని భాషలను పోత్సహించాలని, ముఖ్యంగా సంస్కృతభాషా ప్రోత్సాహానికై కృషిచేయాలనీ (శ్రీ) ప్రమోదగణేశలాలే అన్నారు.

(శ్రీ) ముళ్ళపూడి బాబూరావునవ్యకళా సమితి కార్యనిర్వహణలో గల సాధక బాధకాలు వివరించారు. (శ్రీ) వెంకటాచార్యులు సాహిత్యానికి ప్రత్యేకసంస్థ కావాలన్నారు. (శ్రీ) గర్రెపల్లి సత్యనారాయణ ప్రత్యేక సంస్థ అనవసరమన్నారు. తిరిగి నవ్యకళా సమితి సాహిత్యశాఖనే అభివృద్ధి పరచాలనీ కొత్తగా సంస్థలెందుకని (శ్రీ) శొంఠి కృష్ణమూర్తి ప్రశ్నించారు (శ్రీ) కాళోజి రామేశ్వరరావు నిర్మాణాత్మకకృషి జరపాలని కోరారు.

ఒక్క కావ్యగానమే కాకుండా రచనల్లో వైవిధ్యాన్ని పోషించడానికి అన్ని వ్యాసంగాలకు సమాన ప్రతిపత్తి నొసంగవలెననీ సీరియస్ సబ్జెక్టులకు బదులుగా కొన్నాళ్ళదాక ఎక్‌లైట్ చెన్‌మెంటు కావాలనీ వర్ధిష్ణువులకు గూడ పెద్దలతోపాటు అవకాశాలివ్వాలనీ ఆయన సూచించారు.

సింపోజియమ్‌ల నభివృద్ధి పరచాలని (శ్రీ) మురళీమోహన సూచించారు.

ఈ గోష్ఠి నిర్ణయాల ప్రకారం (శ్రీ) కాళోజి రామేశ్వరరావు యింట్లో 27వ తేది సాయంత్రం (శ్రీ) ఉదయరాజు శేషగిరిరావు కావ్యగానము, (శ్రీ) మురళీమోహనరావు కథానికా పఠనం ఏర్పాటయ్యాయి. 22 న అడవి బాపిరాజు వర్ధంతి నవ్యకళా సమితి పక్షమున నిర్వహింపబడింది.

తేనీటివిందు ఏర్పాటు చేయబడింది సభికులంతా కావ్యగానం చేశారు.

కన్సెషను సీజను టికెట్లు

ఇంజినీరింగు, మెడికల్ విద్యార్థులకు వయస్సు నిషేధం లేదు

న్యూఢిల్లీ, సెప్టెం 22

నివారు రైల్వేలలో 25 ఏళ్ళకు పైబడిన మగ విద్యార్థులకు కన్సెషను సీజనుటికెట్లు ఇవ్వరాదనే నిషేధం, ఇంజనీరింగు, వైద్య విద్యార్థుల విషయంలో రద్దుచేయబడుతుంది ఈ టికెట్లు కావలసిన విద్యార్థులు తమ సంస్థల అధిపతుల వద్ద నుండి ఒక సర్టిఫికెట్టు దాఖలుచేయవలసి ఉంటుంది.

న్యూఢిల్లీలో ఈవేళజరిగినజాతీయ రైల్వేల వాడకందార్ల సంప్రదింపుల మండలి సమావేశంలో రైల్వేమంత్రి శ్రీ జగ్జీవనరాం ఈ విషయం ప్రకటించారు.

25 ఏళ్ళకు పైబడిన ఇతర మగ విద్యార్థుల విషయంలో మాత్రం ఈ నిషేధం యథాపూర్వంగా అమలులో ఉంటుంది

హన్స్ దీవాన్ అండ్ కంపెనీ, బైకుల్లా, బొంబాయి-8
హైదరాబాదు రిప్రజెంటేటివ్స్:
మెస్సర్స్. నూర్ దీన్ కరమాలీ అండ్ కంపెనీ
పీకల్ బజార్, హైదరాబాదు
HD-073

మహత్తరమైన 4 వ సంయుక్త వారము
ఆదర్శలోక్ సమర్పించు
"తీర్థయాత్ర"
(సతీ పూర్ణమాసి పవిత్ర గాథ)

తా॥ మహిపాల్, జైమాల, హీరాలాల్.
(ఇండియాలోని 300 పుణ్యస్థలాలు గేవాకలర్‌లో చూపబడును)
ప్యాలెస్ & కమల్
హైద్రాబాద్, హైద్రాబాద్.
(Trupix) (ప్రి కాస్ పిక్చర్స్ విడుదల)

నేడు 6 0 & 8-50 గం॥
పక్షిరాజావారి
అగ్గిరాముడు తెలుగు
తా॥ ఎన్. టి. రామారావు, భానుమతి, రేలంగి.
ప్రభాత్ - హైద్రాబాద్.
(BAHAR)

సెప్టెంబర్ 25 వరకు ప్రతిరోజు సా॥ 2-30 గం॥ మ్యాటినీ.
ఎ. వి. ఎమ్. వారి "జీవితం" తెలుగు
తా॥ వైజయంతిమాల, ఎస్. వరలక్ష్మి.
ప్రభాత్ హైద్రాబాద్.
(Bahar)
AVM

4 వ సంయుక్త వారం
కుటుంబములకు అత్యుత్తమ కథావస్తువు.
పుష్ప పిక్చర్స్ వారి
* ఘర్ సంసార్ *
తా॥ నర్గిస్, బాల్‌రాజ్ సహానీ, రాజేంద్రకుమార్, షమ్మి, బేబిదేవికా, జానీవాకర్.
నిర్మాత: ఎ. ఎ. నదియాడ్‌వాల. దర్శకత్వం: వి. యం వ్యాస్. సంగీతం రవి
అశోక్ & మనోహర్
హైద్రాబాద్. సికింద్రాబాద్.
(Trupix) విజయరిలీజ్.





నేటి వ్యాపారములు

గుజ్జా బుచ్చయ్యగారి
వెంకటేశం కమీషన్ ఏజంటు
టెలిఫోన్ నెం. 4941

హైదరాబాదు, సెప్టెంబరు 22

120 - శేర్లు. పల్లాఒక్కంటికి

దొడ్డుబియ్యం	54-8-0 57 8-0
వెంబర్లు కొ॥	57-0-0 60-8-0
పాంబర్లు కొ॥	65-0-0 70-0-0
మాకలు	34-0-0 42-0-0
వరంగల్ సాగు॥పా	69 8-0 72-0-0
కందులు పెద్దవి	60-12-0 63-0-0
కందులు చిన్నవి	53-0-0 57-0-0
మినుములు	43-8-0 50-0-0
సెనగలు	57-0-0 57-8-0
తెల్లం	40-0-0 40-0-0
పెసర్లు కొ॥	50-8-0 62-0-0
తెల్లజొన్నలు	41-8-0 42-0-0
పచ్చ జొన్నలు	39 0-0 39-8-0
మిరపకాయలు	150-0-0 220-0-0
పసుపు	52-0-0 55-0-0
వుల్లిగడ్డ కొ॥	18-0-0 26 4-0
చింతపండు కొ॥	58-0-0 72 0-0
నల్లవులువలు	58-0-0 62 0-0
తెల్లనువ్వులు	100-0-0 110-0-0
సద్దలు	
తొధన్ శక్కర (సం॥18)	105-8 0
పెద్దకందిపప్పు	80-0-0 85-0-0
చిన్నకందిపప్పు	75-0-0 82-0-0
పెసగపప్పు	69-0-0
పెసరపప్పు	85-0-0
మినుపపప్పు	70-0-0
లంకపిండి	78-0-0
ఆముదాలు	64-9-0 65-0-0

12 శేర్ల మణుగు

అల్లం	8-0-0 9-0-0
యెల్లిగడ్డ	11-0-0 13-8-0
పల్కు నూనె	17-14-0
ఆలుగడ్డలు	5-0-0

ఈ ప్రకారము యీరోజు అయిన వరలు వ్రాయించినాము గిట్టిన సరుకులు సంపాదించును, తెప్పించుకోవచ్చును.

వెండి, బంగారు ధరలు

సముద్రాల రాఘవులుగారి
చంద్రయ్య దుకాణం.
సిద్దంబర్ బజార్, ఫోన్. నెం- 4890

హైదరాబాదు, సెప్టెంబరు 20

బంగారం	107-0-0
అశోక చీపురు	107-8-0
సవరను	71-8-0
వెండి తు. 100కి.	185-8-0
చిల్లరతు. 1కి.	1-14-0

ప్రకటన

మా కంపెనీలో ఉద్యోగాయున్న శ్రీ భగవాన్‌దాస్ వీర్‌జీదోషి కంపెనీలో పని చేయుట లేదని ఇందుమూలమున అందరికి తెలియజేయునైనది కావున ఇప్పటి నుండి మా కంపెనీ తరపున ఏవిధమైన వ్యాపారమైనా చేసే యెడల మేము ఎట్టి బాధ్యతనూ వహించము.

వసంతరావు ఎపారెఖ్
యునైటెడ్, ఫర్‌వార్డింగ్
క్లియరింగ్ & ట్రాన్స్‌పోర్టు సర్వీస్
సికిందరాబాద్,
1723, మహంకాళిపిన్

ఎలిజబెత్ రాణికూడ ఇండియా రానున్నదా?

ఇంకా సమాచారం అందలేదని
లోకసభలో వివరణ

న్యూఢిల్లీ, సెప్టెం 22

ఎడింబరో యువరాజుతోబాటు ఆయన భార్యఅయిన ఎలిజబెత్ రాణి కూడ భారతదేశం సందర్శిస్తుందో లేదో తమకింకా సమాచారం అందలేదని ప్రధాని నెహ్రూ పార్లమెంటరీ కార్యదర్శి శ్రీ సాదత్ అలీఖాన్ నేడు లోకసభలో శ్రీ రామేశ్వరతాంతియా అడిగిన ప్రశ్నకు జవాబుగా అన్నారు.

జనవరి 21, 29 ల మధ్య న్యూఢిల్లీలో జరిగే భారత సైన్సు కాంగ్రెసు మహాసభలో పాల్గొనేనిమిత్తం బ్రిటిష్ శాస్త్రపురోభివృద్ధి సంఘ ఆహ్వానాన్ని ఎడింబరో యువరాజు అంగీకరించారు ఆ తరువాత ఆయన భారతదేశంలోని శాస్త్రీయ, పారిశ్రామిక కేంద్రాల్ని సందర్శిస్తారు.

(శ్రీ) శాంతియా : ఎలిజబెత్ రాణి కూడ ఆ తరువాత భారతదేశం వస్తుందని ఒక వార్త చూశాను. నిజమేనా?

సాదత్ అలీఖాన్ : ఆ విషయమై సమాచారం లేదు.

డిప్యూటీ స్పీకర్ సర్దార్ హుకుం సింగ్ : ముందు ఎడింబరో యువరాజును రానివ్వండి.

.....

అమెరికాతో బ్రిటిష్ రక్షణ మంత్రి చర్చలు

వాషింగ్టన్‌కు డంకన్ సాండిస్
ప్రయాణం

లండన్, సెప్టెం 22

అమెరికా రక్షణశాఖ నాయకులతో చర్చల నిమిత్తం బ్రిటిష్ రక్షణ మంత్రి డంకన్ సాండిస్ నిన్న వాషింగ్టన్‌కు బయలుదేరాడు. ఆయన అమెరికాలో 15 దినాలుంటాడు. ఆయుధాల తయారీలో సహకారమనే సమస్యపై సాండిస్ వాషింగ్టన్‌లో అమెరికన్ అధికారులతో మాట్లాడుతాడట.

ఈ పర్యటనకూ దూరప్రాచ్యంలో తలెత్తిన తీవ్ర పరిస్థితికూ సంబంధంలేదని ఫార్మోజా సమస్య తలెత్తక పూర్వమే తన పర్యటన నిర్ధారింపబడిందని సాండిస్ ఒక ప్రకటన చేశాడు.

బూల్ చందు వస్త్రాలయంలో నైలాన్ దుస్తుల ప్రదర్శనలు

హైదరాబాద్, సెప్టెం 22

ప్యారగాన్ టెక్స్‌టైల్ మిల్స్ వారు తమ 26వ వార్షికోత్సవ సందర్భమున నైలాన్ దుస్తుల గొప్ప తగ్గింపు అమ్మకపు అవకాశం కల్పించి యీ సందర్భమున బూల్‌చంద్ కంపెనీలో సెప్టెంబర్ 21వ తేదీ ఆదివారమునాడు ప్రదర్శన ఏర్పాటుచేశారు ప్యారగాన్ మిల్స్‌చే ఉత్పత్తి చేయబడిన అనేకరకముల వస్త్రము లచే ప్రదర్శన ఆకర్షవంతముగా వున్నది ప్రదర్శనకు ప్రత్యేకముగా బొంబాయినుండి ఎవరెస్టుకంపెనీ ప్రతినిధి శ్రీమతి అనసూయ గోదీవాల విచ్చేశారు.

ప్యారగన్ మిల్సు అధికోత్పత్తులు, నిపుణతగురించి ఆమె చెప్పి కంపెనీ ఇక నుండుకూడా ఎంతో ఉత్సాహవంతముగా పనిచేసి దేశప్రజల అవసరములు తీర్చగలదనికూడా వివరించారు-

రు. 10 కోట్ల ఖర్చుతో స్త్రీల రక్షణ గృహాలు

పథకానికి ప్లానింగ్ కమీషన్
ఆమోదం

భోపాల్, సెప్టెం 22

కేంద్రసాంఘిక సంక్షేమ బోర్డు అధ్యక్షురాలు శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్ నేడిక్కడ విలేఖరుల గోష్ఠిలో ముచ్చటిస్తూ స్త్రీలకు, బాలనేరస్థులకు రక్షణ గృహాలు, జిల్లా గృహాలు నెలకొల్పాలనే కేంద్ర సాంఘిక సంక్షేమబోర్డు కార్యక్రమాన్ని చాల అనిష్టంతో ఎట్టకేలకు ప్లానింగ్ కమీషన్ ఆమోదించినదన్నారు.

రు. 10.5 కోట్ల ఖర్చుతో బోర్డు ఒక కార్యక్రమాన్ని ప్లానింగ్ కమీషన్‌కు సమర్పించినది వివిధ సంఘ సంక్షేమ పథకాలకు లోగడనే మంజూరి చేయబడిన రు. 33 కోట్లకు అదనంగా ఇది మంజూరి చేయబడింది.

.....

వ్యాపారులపై ముఖ్యమంత్రి, హోంమంత్రి విమర్శలు

ఆక్రోశం, వృత్తిపన్ను నిరసన
కమిటీ అభ్యంతరం

హైదరాబాద్, సెప్టెం 22

వృత్తిపన్ను నిరసన కమిటీ సెప్టెంబర్ 19వ తేదీన జరిగిన సర్వసభ్య సమావేశం వ్యాపారులపై ముఖ్యమంత్రి, హోంమంత్రి వెలిబుచ్చిన కొన్ని అభిప్రాయాలకు నిరసన తెలియజేసింది.

ఆంధ్రప్రదేశ్ వ్యాపార కేంద్ర సంస్థను ఏర్పాటు చేయాలని నవంబరు 23 నుండి మూడురోజులపాటు ఇక్కడ వ్యాపార మహాసభను జరపాలని నిర్ణయించబడింది.

సెప్టెంబరు 30 వ తేదీన గవర్నర్‌కు ఒక మెమోరాండం సమర్పించాలని కూడ నిర్ణయించబడింది.

కేరళలోని పరిస్థితి ప్రమాదకరం

వెంటనే ఎన్నికలు జరపాలని
పట్టంతాను పిళ్లై

త్రివేండ్రం, సెప్టెం 22

ప్రస్తుత కేరళ పరిస్థితిని కొనసాగనివ్వడం ప్రమాద భరితమని ప్రజా సోషలిస్టు నాయకుడు శ్రీ పట్టం తాను పిళ్ళై నేడిక్కడ కేరళ టాస్కు పరివారల సంఘ సమావేశంలో పాల్గొంటూ అన్నారు. రాష్ట్రంలో మ్యూనిస్టేతరుల వ్యక్తిత్వాలు, ఆస్తులకు రక్షణలేకుండా గుర్తించిన తర్వాత యిక కేంద్రం జోక్యం కల్గించుకోవాలని ఆయన అన్నారు.

అయితే రాష్ట్రపతి పాలనను తాను కోరడంలేదనీ, వెంటనే జనరల్ ఎన్నికల్ని జరిపి కొత్త శాసనసభను ఏర్పాటు చేయాలనీ ఆయనన్నారు

మంత్రి సంజీవయ్య పర్యటన

హైదరాబాద్, సెప్టెం 22

స్థానిక స్వపరిపాలనా, కార్మిక శాఖలమంత్రి శ్రీ దామోదరం సంజీవయ్య 24 వ తేదీన బయలుదేరివెళ్ళి మెదక్ జిల్లా గజ్వేలు తాలూకాలోని దౌలతాబాద్, తూప్రాన్ మున్నగు చోట్ల పర్యటించి ఆదే రోజు రాత్రి హైదరాబాద్ తిరిగి వస్తారు.

మళ్ళీ సెప్టెంబరు 29 వ తేదీన కర్నూలుకుబయలు దేరివెళ్ళి నందాల యెమ్మిగనూరు మున్నగుచోట్ల పర్యటించి 30 వ తేదీన హైదరాబాద్‌కు తిరిగి వస్తారు.

డాక్టర్లు లేకుండాఆసుపత్రులు
పురపాలక సంఘం కోరిక

ఇల్లెందు, సెప్టెం 22

ఇల్లెందు పురపాలక సంఘ ప్రత్యేక సమావేశములో కొంతకాలంనుండి స్థానిక వైద్యశాలలో డాక్టరు లేనందున ప్రజలు కష్టనష్టములకు గురిఅవుచున్నారని ప్రభుత్వంవారు వెంటనే పంపుటకు తీవ్రచర్యలు గయికొనాలని కోరినట్లు తెలుస్తుంది.

స్పెషల్ సోషియల్ సర్వీసు డిపార్టుమెంటు డాక్టర్ కూడా ఆశాఖ వైద్యశాలలో ఎనిమిది మాసములనుండి లేరు. ఆశాఖ అధికారులు ఆ వైద్యశాలకు తత్వరలో డాక్టర్‌ను పంపించాలని ప్రజలు కోరుచున్నారు.

మరోయిద్దరు మాజీఖైదీలకు ఉద్యోగం

హైదరాబాద్, సెప్టెం 22

విడుదలయిన యిద్దరు ఖయిదీలు ఒకరు టైలర్‌గా, మరొకరు నిపుణత లేని కార్మికుడుగానికి హైదరాబాదులోని రెండు ప్రముఖ స్థానాలో చేర్చుకోబడినారనీ, యితర సంస్థలుకూడ తమకు ఎలాంటి వ్యక్తులు కావాలో తమకు తెలపవచ్చుననీ ఆంధ్రప్రదేశ్ విడుదలయిన ఖయిదీల సహాయ సమితి ప్రధానకార్యదర్శి వ్రాస్తున్నారు.

కేంద్ర మంత్రి వర్గంలో సగంమంది స్త్రీలు

ఉండాలని శ్రీ వి. వి. గిరి
సూచన

ఆగ్రా, సెప్టెం 22

కేంద్ర మంత్రివర్గంలో సగంమంది స్త్రీలుండాలని ఉత్తరప్రదేశ్ గవర్నర్ శ్రీ వి. వి. గిరి నేడు సూచించారు.

ద్వితీయ యువజనోత్సవ సందర్భంగా ఆగ్రా విశ్వవిద్యాలయ విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తున్న శ్రీగిరి స్త్రీలు గృహవ్యవహారాల్ని సక్రమంగా నిర్వహిస్తుంటే యీ దేశములో హోంమంత్రులు, విదేశాంగ మంత్రులుగా కూడ వారు చక్కగా పనిచేయగలరు అని అన్నారు.

పబ్లిక్ వ్యవహారాలలో స్త్రీల ప్రాముఖ్యాన్ని బట్టి దేశములోని సాంస్కృతిక కార్యకలాపాలలో బాలికలకు ఎక్కువప్రాధాన్యాల్ని కల్పించాలని ఆయనన్నారు.

(యు. పి. ఐ)

...—

పంత్‌కు నంబూద్రిపాద్ టెలిగ్రాం

సభ్యులహక్కులకు భంగకరమని
లోకసభలో మసానీ ప్రతిపాదన

న్యూఢిల్లీ, సెప్టెం 22

హోంమంత్రి పంత్‌కు కేరళముఖ్యమంత్రి నంబూద్రిపాద్ టెలిగ్రాం యివ్వడంపై శ్రీ ఎం. ఆర్. మసాని (స్వతంత్ర) నేడు లోకసభలో ఒక ప్రివిలేజ్ ప్రతిపాదనను తెచ్చారు. సభకు, దేశానికి తమ కర్తవ్యాన్ని నిర్వహిస్తున్న కొందరు సభ్యులపై కేరళ ముఖ్యమంత్రి ఆరోపణలు చేయడం సభ్యుల హక్కులకు భంగకరమని ఆయనన్నారు.

మంగళవారంనాడు దీనిపై ఏ సంగతీ చెబుతానని స్పీకర్ అన్నారు

తూర్పుపాకిస్తాన్ అసెంబ్లీ స్పీకర్ తొలగింపు

అయితే తాను పదవిలోనే
ఉన్నానని అబ్దుల్ హకీం భావన

ఢాకా, సెప్టెం 22

తూర్పుపాకిస్తాన్ శాసనసభాస్పీకర్ తొలగించబడినారు అయితే తనను పదవినుండి తొలగించారనడం పిచ్చిమాట అని స్పీకరు అబ్దుల్ హకీం అంటున్నారు.

ఆయనపై వచ్చిన అవిశ్వాస తీర్మానాన్ని ఆయన త్రోసివేసిన ఫలితంగా శాసనసభలో 'యుద్ధం' జరగడం, ఆ తరువాత పోలీసులు ఆయనను సభనుండి తీసుకొని రావలసి రావడం పాఠకులకు విదితమే

స్పీకరు యింటినుండి పోలీసు రక్షణను, యితర సౌకర్యాలను ప్రభుత్వం ఉపసంహరించుకొన్నది. ఆయన కారు తీసుకొనబడింది

డిప్యూటీ స్పీకరు అధ్యక్షతలో స్పీకరుపై అవిశ్వాస తీర్మానం ఆమోదించబడిందని పాలక పక్షమైన అవామీలీగ్ సంకీర్ణపక్షం పేర్కొన్నది. 170 మంది స్పీకరుకు వ్యతిరేకంగా ఓటు చేయగా, అనుకూలంగా ఎవరూ ఓటు చేయలేదని ఆపక్షం పేర్కొన్నది.

స్కౌటు ఉద్యమంలో కొంత దిగజార్పు

భారతసేవక్ సమాజ్, ఎన్. సి. సి,
ఎ. సి. సి. లు కారణమని
ఒక భావన

హైదరాబాదు, సెప్టెం 22

ఆలిండియా స్కౌట్స్ గైడ్స్ జాతీయ కౌన్సిల్ సమావేశం నవంబరు 1, 2, తేదీల్లో హైదరాబాదులో జరుగుతుంది.

నవంబరు 1 న ఫతేమైదాన్ లో స్కౌట్లు గైడ్ల ర్యాలీ ఒకటి, స్కౌట్లు గైడ్ల ప్రదర్శన ఒకటి యీ సందర్భంగా రాష్ట్ర స్కౌట్ల గైడ్ల సంఘం ఏర్పాటుచేస్తున్నది.

ఆంధ్రప్రదేశ్ స్కౌట్ల గైడ్ల కమిషనర్ ఎస్. ఎం. హైదర్, నఖ్వీ నేడు విలేఖరులతో మాట్లాడుతూ రాష్ట్రములో నాల్గు శిబిరాలను విజయనగరం, హైదరాబాద్, చిత్తూర్, మరో హైదరాబాదు జిల్లా స్థానములో నిర్వహించడానికి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వము రు. 120000 మంజూరు చేసినట్లు తెలిపారు. స్కౌటింగ్ ఉద్యమాభివృద్ధికి రాష్ట్రాల్లో అనేకచోట్ల శిబిరాలు నిర్వహించడానికి రాష్ట్ర శాఖ తలపోస్తున్నది.

నవంబరులో జరిగే ఆలిండియా స్కౌట్లు గైడ్ల జాతీయ కౌన్సిల్ సమావేశానికి మాజీ బొంబాయి గవర్నర్ శ్రీ మంగళదాస్ పక్వాసా అధ్యక్షత వహిస్తారు. ఈ సమావేశం సందర్భంగానే అక్టోబరు 31కి జాతీయ కమిషనర్ జస్టిస్ వివిన్‌బోస్ (న్యూఢిల్లీ), స్కౌట్ల చీఫ్ కమిషనర్ శ్రీ మదన్ మోహన్, గైడ్ల చీఫ్ కమిషనర్ శ్రీమతి క్లబ్‌వాలా జాఫర్‌లు హైదరాబాద్ వస్తారు. ఈ సమావేశములో కేంద్ర విద్యాశాఖామంత్రి డా॥ శ్రీ మాలి, విదేశాంగ వ్యవహారాల శాఖ డిప్యూటీ మంత్రి లక్ష్మీమేనన్, జాతీయ కౌన్సిల్‌లోని కేంద్ర ప్రతినిధి డా॥ ఆర్. కె. జాన్ కూడా పాల్గొంటారు. మూడు రోజులు సమావేశం జరుగుతుంది. ఆఖరునాడు సాంస్కృతిక ప్రదర్శనలుంటాయి.

శ్రీ నఖ్వీ నేడు విలేఖరులగోష్ఠిలో రాష్ట్రమందు 5 వేలమంది స్కౌట్లు, 10 వేల మంది గైడ్లు ఉన్నారని తెలిపారు. కాని భారత సేవక్ సమాజ్, ఎన్. సి. సి., ఎన్. సి. సి. మున్నగు వ్యవస్థవల్ల స్కౌటు ఉద్యమం అంత అభివృద్ధికరంగా లేదని ఆయన అంగీకరించారు. ఎ. సి. సి. యే ఏర్పాటు చక్కటి పర్యవణమని ఎన్. సి. సి. ని కాలేజీలకుమాత్రమే పరిమితం చేయాలనీ నఖ్వీ కోరారు. హైస్కూళ్ళను కేవలం స్కౌట్ల ఉద్యమానికి కేటాయించాలని భారత సేవక సమాజ్ వయోజనులను మాత్రమే చేర్చుకోవాలనీ ఆయన అన్నారు

స్కౌట్లకు రాజకీయ సంబంధాలేమీలేవనీ అన్నిచోట్లనలెనే ఎ.సి.సి. సెషన్ సమయంలోకూడా స్కౌట్లు పనిచేస్తానీ ఆయన పేర్కొన్నారు.

(ఎ-ఎన్-ఎస్)

....

ప్రభుత్వోన్నత పాఠశాల గోషామహాల్ విద్యార్థి సంఘం ఎన్నికలు జరిగి ఈ దిగువవారు ఎన్నికైనారు: ఘులాం అకాని ఉపాధ్యక్షులు, జి. లక్ష్మీనారాయణ కార్యదర్శి, సి. జగన్నాథరావు సహాయ కార్యదర్శి.

పంచదారకు సరసమైన ధర

టారిఫ్ కమిషనువిచారణ

కొత్తఢిల్లీ, సెప్టెం 22

ఇండియాలో తయారయ్యే పంచదార ఉత్పత్తి వ్యయాన్నిగురించి పునఃపరిశీలన జరపి పంచదార పరిశ్రమదారులకు న్యాయంగాఎంతధరచెల్లింపవచ్చును అనే విషయమై నివేదిక సమర్పించవలసిందిగా ఇండియా ప్రభుత్వం టారిఫ్ కమిషనునుకోరినట్లు వాణిజ్య పారిశ్రామిక మంత్రిత్వ శాఖ ఒక పత్రికా ప్రకటన చేసింది. ఆ ప్రకటనలో ఇంకా ఇలాఉంది:— పంచదార ఉత్పత్తి వ్యయాన్ని మరింత చేయడానికి ఒక కొత్త షెడ్యూలును తయారు చేయాలని వెంకటి టారిఫ్ బోర్డు సిఫార్సు చేసింది. అనంతరఆసిఫార్సు ప్రకారం నిపుణుల సంఘం షెడ్యూలును తయారుచేసింది. మరో సంఘం ఈ షెడ్యూలును పరిశీలించి వారికొన్ని సవరణలు సూచించింది. ఇటీవల సేకరించిన వివరాలు ఆధారంగా మళ్ళీ ఒక కొత్త షెడ్యూలును తయారు చేయాలనీ, ఈలోగా సవరించబడిన షెడ్యూలును వాడాలనీకూడా రెండో సంఘం సూచించింది.

ఇటీవల సంవత్సరాలలో ఉత్పత్తి వ్యయం చాలా పెరిగిందనీ, ఈపెరుగుదలను సవరించబడిన షెడ్యూలులో కూడా సరిగా లెక్కలోకితీసుకోలేదని పంచదార పరిశ్రమదారులు ప్రభుత్వానికి విన్నవించారు పురుద్ధరణవ్యయం క్రింద లాభాలు కింద అనుమతించిన మొత్తం చాలా స్వల్పంగా ఉందని కూడా పరిశ్రమదారులు విజ్ఞప్తిచేశారు. అయితే ఇటువెరుకునుపడించే రైతుల ప్రతినిధులు మాత్రం షెడ్యూలులో వేసిన అంచనాఖర్చు అంచనాలు అధికంగానే ఉన్నాయని భావిస్తున్నారు.

అందువేత పంచదార ఉత్పత్తి వ్యయాన్ని పునః పరిశీలించాలని ప్రభుత్వం అభిప్రాయ పడుతోంది.

అవసరమైన దర్యాప్తులు జరుపవలసిందిగా టారిఫ్ కమిషన్‌ను కోరడం అయింది పురుద్ధరణ వ్యయం కింద లాభాల కింద ఎంత మొత్తం అనుమతించాలి అనే విషయమై 3 నెలల్లోగా తొలి నివేదికను సమర్పించవలసిందనీ, ఆతర్వాత పితైనంతత్వరలో తుది నివేదికను (యితర అంశాలను గురించి) సమర్పించవలసిందని, ప్రభుత్వం కమిషనును కోరింది. తుదివిషయంలోఆసక్తిగల వ్యక్తులు కంపెనీలు బొంబాయిలోని టారిఫ్ కమిషను కార్యదర్శికి తమవిజ్ఞప్తులు పంపుకోవచ్చును.....—

లూనజ్ వద్ద డ్రిల్లింగ్ పని ప్రారంభం

కాంబే, సెప్టెంబర్ 22

లూనజ్ నూనెగనివద్ద నేడుడ్రిల్లింగ్ పనులు ప్రారంభింపబడినవి. ఇక్కడ నూనె ఊట పైకి ఎగజిమ్ముకుండటం పనిచేసే సాంకేతిక నిపుణులకు సమస్యగా ఉన్నది.

అఖిలపక్ష ఆహార కమిటీలు కూడవట

డా॥ లోహియా వాదం

గోరఖ్‌పూర్, సెప్టెం 22

కేంద్రంలోనూ, రాష్ట్రాలలోనూ అఖిలపక్ష ఆహారకమిటీల ఏర్పాటుకు సోషలిస్టు నాయకుడు డా॥ రామమనోహర్ లోహియా నేడు తన ప్రతికూల్యాన్ని తెలిపాడు ఆ కమిటీల ఏర్పాటువలన అసలు సమస్య మరుగున పడిపోతుందని ఆయన అన్నారు.

ఉత్పత్తుల సలహాబృందం

మన పరిశ్రమలలో మేలు రకపు
పద్ధతులు ప్రవేశపెట్టే
పరిజ్ఞానానికై విదేశ యాత్ర

కొత్తఢిల్లీ, సెప్టెం 22

జాతీయ ఉత్పత్తి సమితి యేర్పరచిన 8 మంది సభ్యులుగల ఉత్పత్తుల సలహాబృందం పశ్చిమ జర్మనీ, బ్రిటన్, అమెరికాలలో పర్యటించడానికి వెళ్లనది ఈదేశాల్లో ఉత్పత్తికిగాను ఫ్యాక్టరీలు అవలంబిస్తున్న పద్ధతులు వీరు పరిశీలిస్తారు. ముఖ్యంగా శాస్త్రీయమైన మార్గములో ఫ్యాక్టరీల నిర్వహణ, యజమానులకీ, ఉద్యోగులకీ మధ్య మానసిక సంబంధాలూ, వేతనాలూ, లోనస్సుల రీత్యా కార్మికులను ప్రోత్సహించి ఉత్పత్తిఎక్కువచేయడం,ఫ్యాక్టరీల నిర్మాణం, తెలుసుకుంటారు.

జాతీయ ఉత్పత్తి సమితి యిటువంటివే మరొక 7 బృందాలను క్రమేపీ పశ్చిమ యూరప్‌కీ, అమెరికాకీ పంపబోతున్నారు. యునైటెడ్ స్టేట్సు సాంకేతిక సహకారసంస్థ ఆర్థిక సహాయంతో యీ కార్యక్రమం అమలు జరుగుతోంది.

ఈ బృందానికి శ్రీ టి ఆర్. గుప్తా కలకత్తా లైట్ ఇంజినీరింగు వర్క్సు, జనరలు మానేజరు, నాయకులు. ఇందులో తక్కినవారు వీరు:- శ్రీ జె. వి. కృష్ణన్, కాన్పూరులో వాణిజ్య సంస్థ కార్యదర్శి, శ్రీ కాశీనాథ్ పాండే, పార్లమెంటు సభ్యులు, భారత జాతీయ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు, ఉపాధ్యక్షులు: శ్రీ ఎస్. సి. యాంథోనీ పిళ్ళై, పార్లమెంటు సభ్యులు, హిందూ మజ్దూర్ సభ, అధ్యక్షులు. శివ్‌చండికా, భారత జాతీయ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసుకు ప్రధాన కార్యదర్శి ఆర్. ఆర్. జోనిజా, కలకత్తా ఫిలిప్స్ ఇండియా లిమిటెడ్ ఫ్యాక్టరీ మానేజరు; ఎస్. ఎస్. భట్, మద్రాసు బకింగ్‌హాం అండ్ కర్ణాటక మిల్స్ లేబరు ఆఫీసరు, బి. డి. కపూర్ సోనేపట్‌లో అట్లాస్ సైకిల్ ఇండస్ట్రీస్ జనరలు మానేజరు, సంజయ్ సెన్ కలకత్తా పేపర్ మిల్స్ ఇండస్ట్రీస్ డైరెక్టరు జాతీయఉత్పత్తి ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు, పాచ్. బి. బి. శాస్త్రి యీ బృందం అమెరికాకు వచ్చే నెల చేరుతారు.

....

గుజరాత్‌లో వినోబా ప్రవేశం

సోనగాఢ్.(సూరత్), సెప్టెం 22

ఆచార్య వినోబాభావేమహారాష్ట్ర పర్యటనను ముగించుకొని 50 మంది పదయాత్రికులతో బాటు నేటి ఉదయం 8—30 గంటలకు గుజరాత్ ప్రదేశ్‌లో ప్రవేశించారు. గుజరాత్ తరపున ప్రముఖ భూదాన కార్యకర్త శ్రీ రవిశంకర్ మహారాజ్ ఆయనకు స్వాగతమిచ్చారు.

మహారాష్ట్ర, గుజరాత్ సరిహద్దులో ఆయనను కలుసుకొన్న వారిలో కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ ధేబర్, కుమారి మణిబెన్ పటేల్, ఎం. పి. బొంబాయి విద్యామంత్రి శ్రీహితేంద్ర దేశాయ్, మాజీ కేంద్ర మంత్రి శ్రీ ఖండూభాయ్ దేశాయి, శ్రీ నవకృష్ణ చౌధరి ప్రభృతులున్నారు.

వినోబాజీ వారిద్దరినీ ప్రసంగిస్తూ గాంధీకి జోహార్లు అర్పించారు. గాంధీకి గుజరాత్‌లో జన్మించారు. కాని ఆయన భారతదేశానికి యావత్ ప్రపంచానికి చెందిన వారు. నేను గుజరాత్‌కు రావడంతో అనేక సంవత్సరాల తర్వాత స్వగృహానికి వచ్చినట్లు భావిస్తున్నాను" అని నియనన్నారు.

భూదాన గ్రామదాన సత్వర కార్యక్రమాలు

హైదరాబాద్, సెప్టెం 22

ఆంధ్ర ప్రదేశములో భూదాన గ్రామదాన కార్యక్రమములకు సంబంధించి వెంటనే చేపట్టుటకై యీదిగువ కార్యక్రమము నిర్ణయింపబడినది:

మహబూబ్‌నగర్ జిల్లాలో 2లక్షల ఎకరముల భూదాన సేకరణ పూర్తి చేయుటకు 25, వేలు ఖర్చగును; అట్లే కడపజిల్లాలో లక్షలు తాలూకాను తాలూకా దానంగా రూపొందించుటకు; ఆంధ్రప్రదేశ్‌లో భూదాన భూముల పంపిణీ కొరకు: చవుకధరలకు భూదాన, గ్రామదాన సాహిత్యం ప్రచురించుటతో పాటు వ్యవస్థానిర్మాణ మునకు తలొక 25 వేలు ఖర్చు ఉంటుంది; గ్రామదాన గ్రామాలలో నవనిర్మాణ కృషికై లక్షరూపాయలు కావాలి.

ఈ కార్యక్రమములను వెంటనే అమలు జరుపడానికి 2 లక్షల రూపాయల సేకరణ జరుగవలెను. ఆంధ్రప్రదేశ్‌లో ఈ కార్యక్రమం అమలు జరుపుటకై సంపత్తిదాన, సాధారణదాన, సాధన దాన రూపమునదాని ఉదారులైన దాతలు ముందుకువచ్చి సహాయపడాలని రాష్ట్ర సర్వోదయ ప్రచార శాఖ ఒక విజ్ఞప్తి ప్రకటనలో పేర్కొన్నది.

అక్టోబరు 1 వ తేదీ లగాయతు 7వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ సర్వోదయ మండలి కన్వీనర్ శ్రీ ప్రభాకర్ జీ, సర్వోదయమండలి సభ్యులు శ్రీ సాధు సుబ్రహ్మణ్యం కర్నూలు, ఆదోని, గుత్తి గుంతకల్లు ఉరవకొండ, అనంతపురం, తాడిపత్రి సందర్శించి సంపత్తిదాన యాత్ర జరుపుతారు.

ఖమ్మం, సెప్టెంబర్ 22

స్థానిక శ్రీ రామాలయములో ఖమ్మం పట్టణ కాంగ్రెస్ కార్యకర్త శ్రీ బాలారాం చౌదరి ఆధ్వర్యాన ఖమ్మం పట్టణ బిల్డింగ్ వర్కర్స్ సమావేశమై యీ క్రిందివారిని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు:

అధ్యక్షులు:- తోటు పిచ్చయ్య, ఉపాధ్యక్షులు:- బాశెట్టి వీరస్వామి, కార్యదర్శులు:- కమ్మగాని నాగయ్య, కొట్టాటి సత్యం, సహాయకార్యదర్శులు:- దాదె విజయము, రహిమాన్ సాహెబు. కోశాధ్యక్షులు: కల్లెట్ల రాజన్న మరి 12 గురు కార్యవర్గ సభ్యులు.

సెంట్రల్ రైల్వే

రైల్వే డాక్యుమెంట్ల
అదృశ్యము

దిగువను దాహరించిన డాక్యుమెంట్లు వాడి, బందర్ వద్ద పోయినట్లు తెలియ వచ్చినది. కావున అట్టి వాటిని ప్రజలు మోసముచేసి ఉపయోగించకూడదని హెచ్చరిక.

వాడి, బందర్: క్లీన్ చార్జి రసీదు బుక్ నెం. 162/1 నుండి ఫోలియో నెంబర్లు 162/1 నుండి 160/50 వరకుగల పూర్తి ఫాయిల్స్. అన్‌లోడింగ్ మెమో బుక్ నెంబర్లు. 6879/96 నుండి 98 వరకుగల పూర్తి మూడు ఫాయిల్స్ బుక్ నెం. 2441/54 నుండి రెండు, మూడు ఫాయిల్స్ బుక్ నెం. 2144/55 నుండి మొదటి ఫోలియో బుక్ నెం 6894/83, నుండి మొత్తము మూడు ఫాయిల్స్; బుక్ నెం, 9144/21 నుండి మొత్తం మూడు ఫాయిల్స్.

ప్రకటన 22-9-58

కేంద్ర సహకారబ్యాంకు లిమిటెడ్ (2151) భువనగిరి యొక్క సమస్త సభ్యులకు (గత ప్రకటన తేదీ 15-9-58) ప్రకారము తెలియపరచడము యేమనగా ది. 30-9-58 మంగళవారం పగలు గం॥ (2) లకు బ్యాంకు ఆవరణలో 1958 సంవత్సరమునకు సంబంధించిన సాధారణ మహాసభ జరుపబడుచున్నది. కావున తామెల్లరు పాల్గొనగలరని ఆశించుచున్నాము.

చర్చనీయాంశములు:

1. 1958 సంవత్సర వ్యవహారముల నివేదిక 1957 సంవత్సర ఆడిటు లెఖల పట్టికలను మంజూరుచేయుట.
2. 1959 సంవత్సరపు బడ్జెటు మంజూరుచేయుట.
3. బ్యాంకు క్రొత్త నియమావళిని మంజూరుచేయుట.
4. క్రొత్త నియమావళి రిజిస్ట్రీ అయ్యేంతవరకు కార్యనిర్వాహక సభ్యుల యెన్నిక ఆపుట.
5. నెం (4) ప్రతిపాదన అంగీకరింపనియెడల 1959 సంవత్సరమునకు కార్యనిర్వాహక సభ్యుల ఎన్నిక.
6. అధ్యక్షులుగారి అనుమతితో యితర విషయములు.

గమనిక:

1. ప్రతి సంఘమునుండి ఒకరుమాత్రమే ప్రతినిధిగా రావలయును.
2. సంఘ ప్రతినిధులు తమవెంట సంఘము అనుమతిపత్రములు తేగలరు.

ఇట్లు
కార్యవర్గమువారి పక్షమున,
కే. పురుషోత్తమరెడ్డి,
గౌ॥ కార్యదర్శి.

ప్రకటన

విజయవంతమైన 10 వ వారము
శ్రీ పాండకర్స్
మంచి మనసుకు
మంచి రోజులు
(తెలుగు)
తా॥ ఎన్. టి. రామారావు, రేలంగి, గిరిజ, రాజసులోచన.
సాగర్ రాజేశ్వర్ మార్కండేయ
హైదరాబాదు. సికిందరాబాదు. వరంగల్.
రమేష్ - [illegible] బాద్.
(CIMA) రాజ [illegible]

Edited Print